

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కర్నూలు నంద్యాల

గురువారం। 16 అక్టోబరు 2025

పేజీలు 8


# విధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి

- ప్రణాళిక ప్రకారం సమన్వయంతో పని చేయాలి
- ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలి..
- రాష్ట్ర డీజీపీ హరిష్ కుమార్ గుప్తా ఐపిఎస్

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లాలో భారత ప్రధాని నరేంద్రమోడీ గురువారం పర్యటించనున్న నేపథ్యంలో విధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రణాళికప్రకారం సమన్వయంతోపనిచేయాలనిరాష్ట్ర డిజీపి హరీష్ కుమార్ గుప్తా ఐపిఎస్ అన్నారు. ప్రధాని మోడీ పర్యటన ఏర్పాట్ల పరిశీలనలో నిమిత్తం బుధవారం మిగతా 2లో



మాట్లాడుతున్న డిజిపి హరీష్ కుమార్ గుప్తా

# నేడే జీఎస్‌టీ సభ



దేశ ప్రధాని నరేంద్ర మోడీ

- ప్రధాని నరేంద్రమోడీ రాకకు సర్వం సిద్ధం
- రాష్ట్ర సచివాలయమంతా కర్నూలులోనే



మోడీ బహిరంగ సభ జరిగే ప్రాంతం

**సూర్య ప్రతినిధి, కర్నూలు :**
దేశ వ్యాప్తంగా ఇటీవల సవరించిన జీఎస్‌టి ఫలాలు ప్రజలకు అందుతున్న దశలో తాము సాధించిన విజయాన్ని ప్రజలకు చేకూరిన మేలును వివరించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేడు కర్నూలుకు వస్తున్నారు. ఆయన ఆధ్వర్యంలో నగర శివార్లలోని నన్నూరు టోల్ ప్లాజా సమీపంలోని రాగమయూరి వెంచర్‌లో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో సభను నిర్వహించేందుకు సకలం సిద్ధం చేశారు. ఎన్‌డిఎ కూటమిలోని ప్రధాన పార్టీలైన తెలుగు దేశం, జనసేన, బిజెపి నేతలు మూకుమ్మడిగా సభా ఏర్పాట్లను పరిశీలిస్తూ వచ్చారు. ప్రభుత్వం కర్నూలు కలెక్టర్‌గా గతంలో బాధ్యతలు నిర్వహించిన వీర పాండ్యన్‌ను ప్రత్యేకాధికారిగా నియమించారు. ఆయన 10రోజుల క్రితం కర్నూలుకు వచ్చి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరితో కలిసి సమన్వయం చేసుకుంటూ ఎస్పీ విక్రాంత్ పాటిల్ సహకారంతో పనులు మొదలు పెట్టారు. రాత్రింబవళ్లు పని చేసి నిర్విఘ్నంగా పనులు పూర్తి చేసి ప్రధాన మంత్రి భద్రతా విభాగం అధికారులకు బుధవారం అప్పగించారు. వారు సభా ప్రాంగణం మొత్తం కలియదిరిగి ఏర్పాట్లపై తమ హర్షాన్ని వ్యక్తం చేస్తూ ప్రతి చిన్న విషయాన్ని భద్రతాచర్యలకు అనుకూలంగా చేశారని జిల్లా యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. సభా ఏర్పాట్లను ఏర్పాటు చేసేందుకు నిరంతరం కృషి చేసిన అధికారులు ఎస్పీజి బృందం నుంచి అందుకున్న అభినందనలతో తాము పడ్డ కష్టమంతా మర్చిపోయి మరింత ఉత్సాహంతో పని చేస్తున్నారు. మిగతా 2లో



సిద్ధమైన సభా వేదిక



సభకు వెళ్లే ప్రధాన ముఖద్వారం




సూర్య

గురువారం| 16 అక్టోబరు 2025

# నేడే జీఎస్‌టీ సభ

(మొదటి పేజీ తరువాయి)

**ఢిల్లీ నేరుగా కర్నూలుకు.. :** ఢిల్లీ నుండి ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేరుగా కర్నూలు విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో చేరుకుంటారు. అక్కడ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు ఆయనకు స్వాగతం పలుకుతారు. ఆ తర్వాత ఇప్పటికే సిద్ధంగా ఉంచిన హెలికాప్టర్‌లలో శ్రీశైలం సమీపంలోని సున్నిపెంటకు వెళతారు. అక్కడి నుండి రోడ్డు మార్గం గుండా శ్రీశైలంలోని బ్రమరాంబిక అతిథిగృహానికి చేరుకుని కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం మొదట శివాజీ స్ఫూర్తి కేంద్రం ఆ తర్వాత భ్రమరాంభిక మల్లికార్జునల ఆలయాలను సందర్శించి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహిస్తారు. ఆ తర్వాత తిరిగి అతిథిగృహం చేరుకుని అక్కడే భోజనం చేస్తారు. ఆ వెంటనే తిరిగి సున్నిపెంటకు రోడ్డు మార్గం ద్వారా వచ్చి హెలికాప్టర్‌లో జీఎస్‌టి సభా ప్రాంగమైన నన్నూరు టోల్ ప్లాజా సమీపంలోని రాగమయూరి వెంచర్‌కు చేరుకుంటారు. అక్కడ అధికార, అనధికార ప్రముఖులతో పరిచయ కార్యక్రమాలు ముగిసిన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 13వేల కోట్లకుపైగా నిధులను వెచ్చించి చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు. ఆ వెంటనే సభా వేదిక వద్దకు వచ్చి ప్రజలనుద్దేశించి జీఎస్‌టి విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలు, ప్రజలకు అందుతున్న ఫలాల గురించి వివరించనున్నారు. ఈ సభలో ప్రధానమంత్రితో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌లు సైతం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.

**కర్నూలులో వేలసంఖ్యలో పోలీసులు :** కర్నూలు నగర శివారులలో నిర్వహించనున్న జీఎస్‌టి మహాసభ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు చోటు లేకుండా రాష్ట్ర హోంశాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేశారు. డీజీపి హరీష్ గుప్తా ఆద్వర్యంలో రాష్ట్ర స్థాయి అధికారుల నుంచి ఐపిఎస్ అధికారులంతా ఏకమై భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ఇందుకోసం సుమారు 7500మంది పోలీసులు పనిచేస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్ల నుండి కానిస్టేబుళ్లను పెద్దసంఖ్యలో కర్నూలుకు తరలించారు. వీరు కాకుండా ప్రధానమంత్రి ప్రత్యేక భద్రతా విభాగం ఎస్పీజీకి చెందిన మరో 300మంది కూడా పనిచేస్తారని అధికార వర్గాలు వెల్లడించాయి.

**రాష్ట్ర సచివాలయం కర్నూలులో..:** ప్రధానమంత్రి ఆద్వర్యంలో నిర్వహిస్తున్న జీఎస్‌టి మహాసభ సందర్భంగా రాష్ట్రానికి అవసరమైన నిధులు, కార్యక్రమాల కోసం ప్రధానమంత్రికి ఏం విన్నవించుకోవాలి, ఎంత నిధులు కోరాలో ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారాన్ని అందించేందుకు రాష్ట్ర సచివాలయంలోని అన్ని విభాగాలకు చెందిన అధికారులు కర్నూలుకు చేరుకున్నారు. ఇప్పటికే రాష్ట్ర అవసరాలకు కేంద్రాన్ని కోరే అంశాలపై నివేదిక సిద్ధం కాగా చివరి క్షణంలో కూడా ఇంకా ఏమైనా అవసరమైతే ప్రధాని దృష్టికి తీసుకుపోయేందుకు అవసరమైన నివేదికను సిద్ధం చేసేందుకు వారు నిరంతరం పనిచేస్తున్నారు. మొత్తం మీద జీఎస్‌టి మహాసభను ఘనంగా నిర్వహించి ప్రధాని నుంచి అభినందనలు, నిధులు సంపాదించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి అంతా ఇంతా కాదు. మరి ప్రధాని ఏం వరాలు ఇస్తారో వేచి చూడాలి.



సభ వద్ద భోజన, తాగునీటి వసతి ఏర్పాటు చేస్తున్న దృశ్యం



బందోబస్తు కోసం సిద్ధంగా ఉన్న పోలీసులు



మోడీ బ్యానర్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

# శ్రీ చైతన్య విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలి

**– జిల్లా విద్యాశాఖ ఆదేశాలు బేఖాతారు...**

**పత్తికొండ, మేజర్ న్యూస్ :** శ్రీ చైతన్య విద్యాసంస్థపై జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు బిజెపి కో–కన్వీనర్ గోవర్ధన్ నాయుడు, జిల్లా కార్యదర్శి బోయ బ్రహ్మయ్య, టిఎన్‌ఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు మునినాయుడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్పొరేట్ శ్రీ చైతన్య విద్యాసంస్థకు ప్రభుత్వం సెలవు ప్రకటించినా తరగతులను నిర్వహించడంతో ఈ విషయం తెలుసుకొన్న కూటమి నాయకులు పాఠశాల వద్ద వెళ్ళి ఆ పాఠశాల డీన్‌తో వాగ్వివాదం చేశారు. విద్యాశాఖ అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారని పాఠశాల వద్ద ఆందోళన చేశారు. పాఠశాలలో ఉన్న విద్యార్థులను యజమాన్యం తరలి వెళ్లడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ, దేశ ప్రధాని గురువారం కర్నూలులో పర్యటన సందర్భంగా, ఉమ్మడి జిల్లాలో రెండురోజులపాటు విద్యాశాఖ పాఠశాలలకు సెలవు ప్రకటించడం జరిగింది. ప్రభుత్వం సెలవు ప్రకటించిన శ్రీ చైతన్య విద్యాసంస్థ యజమాన్యం నిర్లక్ష్య వైఖరితో పాఠశాలను తెరచకొని తరగతులను నిర్వహించడం ఏమిటని వారు ప్రశ్నించారు. ప్రభుత్వ ఆదేశాలు దిక్కరించిన శ్రీచైతన్య విద్యాసంస్థలపై జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాల తెరుచుకొని తరగతులు నిర్వహిస్తున్న చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న మండల విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు ఓబిసిమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కరణం వినోద్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

# విధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)



హాజరైన డిఐజిలు, ఎస్పీలు

వ్యాస్ ఆడిటోరియంలో అడిషనల్ డిజీపి మధుసూదన్ రెడ్డి, ఐజి శ్రీకాంత్, డిఐజిలు కోయ ప్రవీణ్, గోపినాథ్ జెట్టి, సెంథిల్ కుమార్, సత్య యేసు బాబు, పక్కీరప్ప కాగినెల్లి, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. మొదటగా ప్రధాని పర్యటనలో భద్రతా ఏర్పాట్లను ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌నుఅడిగి తెలుసుకున్నారు. ప్రధాని పర్యటన మినిట్ టు మినిట్‌ప్రోగ్రాం, రూట్ మ్యాప్, రాగమయూరి బహిరంగ సభ, గూగుల్ జియో మ్యాప్‌లను తెరపై చూపిస్తూ రాష్ట్ర డిజిపికి ఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని పర్యటనలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యల ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. బందోబస్తు నిర్వహించే ఐపిఎస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సామాన్య ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రోడ్ షో ఉన్న చోట బారికేడ్లు, రోప్ పార్టీలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అవసరమైతే వాలంటీర్ల సహకారం తీసుకోవాలన్నారు. గ్యాలరీలో ఉండే ప్రజల పట్ల సెక్టార్ ఇంచార్జ్ ఐపిఎస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు మార్గాలు, ట్రాఫిక్ మళ్లింపు, కాన్వాయ్‌లు, ఎయిర్‌పోర్టు, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రదేశాలు బహిరంగ సభకు ఇరువైపులా అప్రమత్తంగా ఉండాలన్నారు. అడిషనల్ డిజీపి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ అవసరమైన చోట్ల నన్నూరు టోల్ గేట్ వద్ద అత్యవసరమైతే పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రోడ్ షో ఉన్న చోట పబ్లిక్ గ్యాలరీల ముందు ఉన్న ప్రజలు లేచి నిలబడి గుమిగూడకుండా వెనక ఉన్న ఇతర ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలన్నారు. బహిరంగ సభ వద్ద మఫ్టీ పోలీసులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వివిఐపిలు వెళ్లేంతవరకు ఎక్కడా ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఐజి సీతారాం, షల్‌కే నచికేత్ విశ్వనాథ్, ఐపిఎస్ అధికారులు దీపికా పాటిల్, పరమేశ్వరరెడ్డి, చక్రవర్తి, శ్రీనివాసరావు, గంగాధరరావు, ధీరజ్ కునుబిల్లి, దేవరాజ్, సుమిత్ సునీల్, కమాండెంట్ ఆనంద్ రెడ్డి, ట్రైనీ ఐపిఎస్ అధికారులు, అడిషనల్ ఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన విభజన హామీలు నేరవేర్చాలి

**మంత్రాలయం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని సీపీఐ, సీపీఎం పట్టణ కార్యదర్శులు కల్లుబావి రాజు, లక్ష్మన్న, సీపీఐఎంఎల్‌నాయకులు వెంకప్ప, లింగన్నలు పేర్కొన్నారు. బుధవారం వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గో బ్యాక్ నరేంద్రమోడీ అనే కార్యక్రమంలోభాగంగా, భీమాస్ సర్కిల్‌లో నల్ల బెలూన్ల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నిధులు కేటాయించాలన్నారు. రాయలసీమకు తాగు, సాగునీరు, పెండింగ్ ప్రాజెక్టులు నిర్మించి నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రత్యేక హోదా ఊసేత్తకపోవడం దానికి కూటమి ప్రభుత్వం వత్తాసు పలకడం సిగ్గుచేటన్నారు. జివిస్టీ విజయసభలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రమేష్ కుమార్, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి అంజిత్ కుమార్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రామకృష్ణ, శంకర్, చిట్టిబాబు, కౌలు రైతు సంఘం నాయకులు సత్యనారాయణ, గంగన్న, కార్మిక సంఘం నాయకులు శేక్షావలి, సిఐటీయు నాయకులు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

# ప్రధాని జీఎస్టీ బహిరంగ సభను విజయవంతం చేద్దాం

**ఆస్పరి, మేజర్ న్యూస్ :** కర్నూలులో జరిగే ప్రధాని జీఎస్టీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆలూరు టీడీపీ ఇంచార్జీ వైకుంఠం జ్యోతి, శివప్రసాద్, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మలు పేర్కొన్నారు. బుధవారం ఆస్పరి మండల టీడీపీ కార్యకర్తల సమావేశంలోవారు మాట్లాడుతూ,ప్రధానమంత్రి నరేంద్రమోడీ జివిస్టీపై చర్చిస్తున్నట్లు తెలిపారు. సభను విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త చురుకుగా పాల్గొని తమవంతు కృషి చేయాలన్నారు.జిల్లానియోజకవర్గపరిశీలకులునాగరాజు,బలిజకార్పొరేషన్ ఛైర్మన్ పాల్గొన్నారు.

# జీఎస్‌టీ తగ్గింపు టూరిజం రంగానికి మంచి ఊతం



**కర్నూలు, మేజర్‌న్యూస్ :** జీఎస్‌టి తగ్గింపు టూరిజం రంగానికి ఎంతో ఆదరణ పెరుగుతుందని సెట్కూరు సిఈఓ డాక్టర్ వేణుగోపాల్ తెలియజేశారు. మైనింగ్ డిపార్ట్‌మెంట్ ఆద్వర్యంలో లాడ్జిలు, రెస్టారెంట్లు, ట్రావెల్స్‌లలో సూపర్ జీఎస్‌టి–సూపర్ సేవింగ్‌పై బుధవారం ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా హరిత హోటల్, అతిథి లాడ్జి, పిస్తా హౌస్‌లలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సెట్కూరు సిఈఓ మాట్లాడుతూ నూతన జీఎస్‌టి స్లాబుల సవరణ వల్ల జిల్లా టూరిజం రంగంలో బడ్జెట్ హోటళ్లలో 12శాతం నుండి 5శాతం, ప్రీమియం హోటల్ రూంలలో 18శాతం నుండి 12శాతం వరకు తగ్గిందని జీఎస్‌టి తగ్గింపు వల్ల పర్యాటక ప్రాంతాలకు, యాత్రికులకు వ్యాపార పరంగా, వివిధ ప్రాంతాలకు సందర్శించే వారికి చాలా డబ్బు ఆదా అవుతుందని తెలియజేశారు. డిడి మైన్స్ అండ్ జియాలజీ రవిచంద్ర మాట్లాడుతూ జీఎస్‌టి 0.2సంస్కరణలలో హోటళ్లు, రెస్టారెంట్‌లు, ట్రాన్స్‌పోర్టు ఆపరేటర్లకు ఆదరణ పెరిగిందని హోటళ్లు, లాడ్జిల యజమానులు ఈ తగ్గింపును బిల్లులో వినియోగదారులకు చూపించాలని తద్వారా వినియోగదారులలో విశ్వాసం పెరుగుతుందని అంతేకాక టూరిజం ప్యాకేజీలు కూడా తగ్గాయని కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల్లో ఉన్న పుణ్యక్షేత్రాలకు సందర్శకులు కూడా పెరిగారని తెలియజేశారు.

**ఉపాధ్యాయులందరిని రిలీవ్ చేయాలి**

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** బదిలీ పొందిన ఉపాధ్యాయులందరిని రిలీవ్ చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం ఆయన మంత్రాలయంలో ఎంఈఓను మోహినుద్దీన్‌ను కలిసి బదిలీ పొంది రిలీవ్ కాని ఉపాధ్యాయులు సమస్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2025 డిఎస్సీ మూడో కేటగిరిలో వివిధ పాఠశాలలో ఖాళీలు చూపనందున ఆ పాఠశాలలకు నూతన ఉపాధ్యాయులు రాలేద న్నారు. ఎమ్మార్సి వారు సరైన ఖాళీల వివరాలను పంపలేనందున ఇలా జరిగిందన్నారు. అనంతరం ఎంఈఓకు ఎస్టీయు నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో ఎస్టీయు నాయకులు బసవరాజు, ప్రసన్నరాజు, బాబయ్, ఎల్లప్ప, ఈరన్న, నాగభూషణం, శీలప్ప, రామచంద్ర, చిన్న తిమ్మన్న, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడం దుర్మార్గం



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

**కర్నూలు జడ్‌పి, మేజర్‌న్యూస్ :** ప్రధాని పర్యటన సందర్భంగా విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడం దుర్మార్గమైన చర్య అని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ షాబీర్ బాష ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పర్యటన సందర్భంగా విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడం ఏంటని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సాక్ష్యాత్తు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేష్ రాజకీయాలను విద్యావ్యవస్థలోకి రానివ్వమని ప్రగల్బాలు పలికి నేడు ఈ పరిస్థితులను ప్రోత్సహించడం సరైన పద్ధతి కాదన్నారు. పాఠశాలలకు రెండ్రోజులు సెలవులు ప్రకటించడం సమంజసం కాదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని లేనిపక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, నాయకులు శరత్ కుమార్, అశోక్, మునిస్వామి, నాని, దేవా తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ పర్యటనను విజయవంతం చేద్దాం – సర్పంచ్ పల్లె నిర్మలమ్మ


ప్రజలతో మాట్లాడుతున్న సర్పంచ్ పల్లె నిర్మలమ్మ

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ శ్రీశైలం, కర్నూలులో పర్యటిస్తున్న సందర్భంగా కర్నూలులో నిర్వహించే భారీ బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని జూపాడుబంగ్లా మండల పరిధిలోని పోతులపాడు గ్రామ సర్పంచ్ పల్లె నిర్మలమ్మ అన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్ సభకు తరలి రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లె శివానందరెడ్డి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## మోడీ గో బ్యాక్ అంటూ కోడుమూరులో నిరసన

**:– వామపక్షాల ఆద్వర్యంలో నల్ల జెండాలతో ర్యాలీ**



నిరసన చేస్తున్న వామపక్ష నాయకులు

**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** ప్రధాని మోడీ గో బ్యాక్ అంటూ కోడుమూరులో నిరసన ర్యాలీ చేపట్టారు. రాష్ట్ర విభజన హామీలను నెరవేర్చకుండా ఏపిలోని కర్నూలులో మోడీ పర్యటనను నిరసిస్తూ పట్టణంలోని గాంధీ విగ్రహం నుండి వామపక్ష పార్టీల ఆద్వర్యంలో బుధవారం నల్ల జెండాలతో నిరసన చేపట్టి మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కోట్ల సర్కిల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి సిపిఎం సీనియర్ నాయకులు గఫూర్ మియా అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం మండల కార్యదర్శులు రాజు, కామర్తి రాజు, సిపిఐ పట్టణ కార్యదర్శి శేషు కుమార్, సిఐటియు మండల కార్యదర్శి ఈరన్న, ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు ముస్తఫా, చేనేత కార్మిక సంఘం నాయకులు లక్ష్మన్న, బాష, ప్రజా సంఘాల నాయకులు పెద్దయ్య, రాముడు, రాజు, గోవిందు, అలీసా, మధు, బాష, సులోచనమ్మ, మునిస్వామి, గిద్దయ్యం మహేష్, బాష తదితరులు పాల్గొన్నారు.

## ఏపికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలి

**సిపిఐ మండల కార్యదర్శి టి.కృష్ణ**
**వెల్దుర్తి, మేజర్‌న్యూస్:**



రాస్తారోకో చేస్తున్న సిపిఐ నాయకులు

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయని, వెనుకబడిన రాయలసీమ జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజి ప్రకటించని దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రాస్తారో కో నిర్వహించామని మండల సిపిఐ కార్యదర్శి టి.కృష్ణ ఆరోపించారు. ఈ సందర్భంగా టి.కృష్ణ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో పర్యటన చేస్తున్నటువంటి నరేంద్రమోదీ కర్నూలు జిల్లాకు రావడం వలన ప్రజలకు ఓరిగిందేమిలేదని, విద్యార్థులకు, కార్మికులకు, రైతులకు ఇబ్బందులు గురిచేస్తూ బహిరంగ సభలు జనాల కోసం బస్సులు, ఆటోలు ప్రజలను తోలుకోవడం తప్ప ప్రజాధనాన్ని వృధా చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రైతు సంఘం అధ్యక్షుడు డి.రాజు, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శులు చిన్నమాదులు, శివ, సిపిఐ మండల నాయకులు వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, రాముడు, చిన్న వ్యాపార సంఘం అధ్యక్షులు అనీల్, ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు శ్యామ్, యశ్వంత్‌లు పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ ఖాళీ బిందెలతో ఆందోళన

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని జలదుర్గం మేజర్ గ్రామ పంచాయితీలోని కొత్తకొట్టాల ప్రాంతంలో నివసిస్తున్న పేద ప్రజలకు దాదాపు మూడు నెలలుగా త్రాగడానికి నీరు సరఫరా కావడంలేదని, మా త్రాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ బుధవారం సచివాలయం ముందు ఖాళీ బిందెలతో కొత్తకొట్టాల నివాసితులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులు ఎస్ఏ.చిన్నరహిమాన్, నక్కిశ్రీకాంత్, జలదుర్గం నాయకులు పద్మశాలి శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలోని పెద్ద గ్రామ పంచాయితీ అయిన జలదుర్గం గ్రామంలోని కొత్తకొట్టాల ప్రాంతంలో మూడు నెలలుగా త్రాగునీటి సరఫరా లేక కాలనీలో నివసిస్తున్న 200 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటుంటే వారి త్రాగునీటి సమస్యను పరిష్కరించడంలో పంచాయితీ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. కావున ఇప్పటికైనా త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని నివసితులు కోరారు. ఈ కార్యక్రమంలో వద్దె శ్రీను, వద్దె కృష్ణ, సెంట్రింగ్ మధు, లక్ష్మన్న, మద్దిలేటి, ఆనంద్, వీరభద్రుడు, నాగరాజు, సువర్ణ, లక్ష్మిదేవి, మహేశ్వరమ్మ, రాజేశ్వరి, కాలనీలోని మహిళలు ఖాళీ బిందెలతో పాల్గొన్నారు.



సచివాలయం ముందు ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న కొత్తకొట్టాల నివాసితులు

## మిస్సైల్ పితామహుడు డా. ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు


డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసిన దృశ్యం

**ఆళ్లగడ్డ,మేజర్ న్యూస్ :**మిస్సైల్ పితామహుడు,భారత మాజీ రాష్ట్రపతి భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భాన్ని పురస్కరించుకొని ప్రపంచ విద్యార్థుల దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్న సందర్భంగా అపుస్మా ఆళ్లగడ్డ నియోజవర్గం యూనిట్ ఆధ్వర్యంలో అపుస్మా అధ్యక్షులు టి.అమీర్ బాషా నేతృత్వంలో, ప్రభుత్వ ఉపాధ్యాయుడు సి రామకృష్ణ, టి ఇమ్రాన్ భాష, ఉపాధ్యాయ బృందం కలిసి ఆళ్లగడ్డ నగరంలో పోలీస్ స్టేషన్ ఆవరణలో గల డా.అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అపుస్మా అధ్యక్షుడు టి అమీర్ బాషా మాట్లాడుతూ అబ్దుల్ కలాం పేపర్ బాయ్ నుండి మిస్సైల్ శాస్త్రవేత్తగా, ప్రజల రాష్ట్రపతిగా ఎదిగి సమాజానికి ఆదర్శవంత జీవనం గడిపి అందరికీ ఆదర్శనీయుడుగా నిలిచి కలలు కనండి సాకారం చేసుకోండి అన్న పిలుపుతో విద్యార్థులలో యువతలో ప్రేరణ కలిగించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు సి రామకృష్ణ మాట్లాడుతూ ఈ తరం లో ఇలాంటి మహనీయుని మన కళ్లతో చూడటం మన అందరి భాగ్యం వారి నిజాయితీ దేశభక్తి సరళమైన జీవనం గడిపి భారతీయుల హృదయాలలో ముఖ్యంగా యువత విద్యార్థులలో తనదైన ముద్ర వేసుకున్న మహాత్ముడిని ప్రశంసించారు.

## ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

**అంగన్‌వాడీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలిత**
**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలోని అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్లు, మినీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.28వేలు ఇవ్వాలని కోరుతూ బుధవారం కర్నూలు నగరంలోని గెస్ట్‌హౌస్ నందు స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రివర్యులు గుమ్మిడి సంధ్యారాణికి అంగన్‌వాడి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలిత, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చౌడేశ్వరీ, జిల్లా కౌన్సిల్ మెంబర్ పిఎం.పార్వతిలు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడి వర్కర్లకు, సమ్మె సమయంలో ఇచ్చినటువంటి మినిట్స్ కాపీలలోని వేతనాల పెంపు, తదితర సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఇచ్చినటువంటి హామీని సిఎంతో మాట్లాడి అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన సరుకులను ప్రభుత్వమే అంగన్‌వాడి కేంద్రాలకు చేర్చాలని, అర్హులైన మినీ టీచర్ల జాబితా కలెక్ట్ చేసిన తరువాత హెల్పర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. గ్రాజుడుటీ 1972 యాక్ట్ ప్రకారం మధ్యలో మానుకొని వెళ్ళిన వారికి వచ్చినంత అమౌంట్ చెల్లించే విధంగా చూడాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి యూనియన్ నాయకురాలు పాల్గొన్నారు.


మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

# రాయలసీమ ద్రోహి నరేంద్ర మోడీ

**-రాయలసీమ డిక్లరేషన్ అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన ప్రధాని**
**-రాయలసీమకు ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి..**
**-8 సంవత్సరాలు జీఎస్టీ పేరుతో ప్రజల నుంచి దోచుకున్న డబ్బు రూ.200 కోట్లు ఖర్చుపెట్టి జీఎస్టీ తగ్గించాం అని ఉత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటు.**
**-ఏఐసీసీ సభ్యులు కాంగ్రెస్ నందాల పార్లమెంట్ జిల్లా డీసీసీ అధ్యక్షులు జె.లక్ష్మీనరసింహ యాదవ్**



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** రాయలసీమ ద్రోహి నరేంద్ర మోడీ అని,రాయలసీమ డిక్లరేషన్ అమలు చేయడంలో ప్రధాని మోడీ పూర్తిగా విఫలమయ్యారని కాంగ్రెస్ నంద్యాల పార్లమెంటు జిల్లా డిసిసి అధ్యక్షులు మరియు ఏఐసీసీ సభ్యులు కర్నూలు జిల్లా ఇన్చార్జి లక్ష్మీ నరసింహ యాదవ్ అన్నారు. బుధవారం విలేఖరుల సమావేశంలో లక్ష్మీ నరసింహా యాదవ్ మాట్లాడుతూ గత 12 సంవత్సరాల కిందట రాష్ట్రం విడిపోయినప్పుడు విభజన హామీ చట్టాల్లో పెట్టిన హామీలలో ప్రధానమైనది ప్రత్యేక హెూదా అని కేంద్రం కానీ బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వలేదన్నారు. దానితోపాటు రాయలసీమ ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని చట్టంలో పెట్టినప్పటికీ నేటి కూడా మోడీ ప్రభుత్వం రాయలసీమ ఉత్తరాంధ్రప్రదేశ్ కు ఇవ్వలేదనీ విమర్శించారు. ఈ నెల 16 న భారత ప్రధాని మోడీ కర్నూలు జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా రాయలసీమ ప్యాకేజీని తక్షణం అమలు చేయమని కాంగ్రెస్ పార్టీ పరంగా డిమాండ్ చేశారు. మోడీ ఇప్పటివరకు ఎన్ని అబద్ధాలు ఆడినా ఆంధ్ర ప్రజలు కాబట్టి మోసం చేసిన పట్టించుకోలేదన్నారు. నేడు మోదీ కర్నూలు వస్తున్న సందర్భంగా తక్షణం రాయలసీమ ప్యాకేజీని అమలు చేయాలన్నారు. రాయలసీమ ప్రజలు దీనిపై స్పందించి ప్రధానమంత్రిని డిమాండ్ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జగన్ పార్టీ మోడీకి పూర్తి మద్దతు గా ఉన్నప్పటికీ రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు.మోడీ ఇప్పటికైనా కళ్ళు తెరిచి రాష్ట్రానికి రాయలసీమ ప్యాకేజీని తక్షణ అమలు చేసే విధంగా మోడీ పై ఒత్తిడి తీసుకురావాలనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని భాగస్వామి పార్టీల్ని డిమాండ్ చేశారు. తక్షణం రాష్ట్రానికి రావలసిన విభజన హామీలను అమలు చేయాలనినిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానటువంటి నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు అయినప్పటికీ కనీసం లక్ష ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు జిఎస్టి తగ్గించామని గొప్పలు చెప్పుకున్నటువంటి కూటమి ప్రభుత్వం నాయకులకు ఈ 8 సంవత్సరాలలో చిన్న తరహా మధ్యతరహా చిన్న వ్యాపారస్థులు నుంచి దోపిడీ చేసి కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టారని ఎద్దేవా చేశారు.ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. పార్లమెంట్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చి రాజ్యాంగం భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తుంటే తాను బీసీ ప్రధానమంత్రిని చెప్పుకున్నటువంటి నరేంద్ర మోడీ బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి రాయలసీమలో డిక్లరేషన్ లో రెండో రాజధాని నిర్మిస్తానని చెప్పి రాయలసీమ ప్రజలను తీవ్రంగా మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు 8 సంవత్సరాల నుంచి జిఎస్టి పేరుతో ప్రజల నుంచి దోచుకున్న డబ్బు 200 కోట్లు ఖర్చుపెట్టి జీఎస్టీ తగ్గించామని ఉత్సవాలు జరుపుకోవడం కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటు ఒకవైపు ఈ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలు పేద వర్గాలు ఉన్నటువంటి బీసీ, ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ హాస్టల్లో సరైన వసతులు లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు వాటి సొంత భవనాలు నిర్మాణం చేపడితే ఎంతో మంది పేద విద్యార్థులు చదువుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో డోన్ నియోజకవర్గం ఇన్చార్జి గార్లపాటి మద్దిలేటి స్వామి జిల్లా ఉపాధ్యక్షులు బాలస్వామి ఎన్నికల్లో జనార్ధన్ అసంఘటిత కార్మికుల చైర్మన్ పఠాన్ హబీబ్ ఖాన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రజాక్ వలి జిల్లా అధికార ప్రతినిధి సంజీవ్ కుమార్ మహిళా జిల్లా అధ్యక్షురాలు సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శాంతినికేతన్ సిబిఎస్ఈ పాఠశాలలో ఘనంగా అనిమల్స్ డే

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** పట్టణంలోని క్రాంతి నగర్ శ్రీ శాంతినికేతన్ సి బి ఎస్ ఈ పాఠశాల లో బుధవారం రెండవ తరగతి విద్యార్థులు"అనిమల్స్ డే " కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమములో విద్యార్థులు వివిధ జంతువుల వేషధారణలతో చూపరులనుఎంతగానో ఆకట్టుకున్నారు. విద్యార్థులు పులి,సింహం, తాబేలు, జిరాఫీ, బాతు, నెమలి, అడవి మనిషి మొదలగు పాత్రలతో చక్కగా అలరించారు. కార్యక్రమములో ఏ టూ జడ్ జంతువుల పేర్లు, జంతువులకు సంబంధించిన హాస్య లఘునాటిక, జంతువుల డాన్స్,జంతువులపై చక్కని పద్యం, జంతువుల పట్ల మానవులు ప్రవర్తించవలసిన తీరు, ప్రకృతిలోని జంతువుల పరిచయ కార్యక్రమం తదితర విషయాలను చిన్నారులు చక్కగా వివరించారు.ఈ కార్యక్రమానికి శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల ప్రిన్సిపల్ రమ్య రెడ్డి పాల్గొని చిన్నారులను ఎంతగానో అభినందించారు.



కార్యక్రమములో విద్యార్థులు ఆయా పాత్రలకు సంబంధించిన వేషధారణ ఎంతో ముచ్చట గొల్పిందన్నారు. విద్యార్థుల పాత్రలకు సంబంధించిన భావ భావ ప్రకటనలు ప్రేక్షకులనుఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువతరం కలాం అడుగుజాడల్లో నడవాలి

**:- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్వి మాధవ్**



మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్వి మాధవ్

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** యువత డా. ఏపిజే అబ్దుల్ కలాం కలలను సాకారం చేయడమే లక్ష్యంగా పెట్టుకోవాలని బీజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ అన్నారు. బుధవారం నగరంలోని సిల్వర్‌జూబ్లీ కళాశాలలో డాక్టర్ ఏపిజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా పివిఎన్వి మాధవ్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మాధవ్ మాట్లాడుతూ పీవీ నరసింహారావుచే ప్రారంభించబడ్డ కళాశాలలో అబ్దుల్ కలాం జయంతి చేయడం గొప్ప పరిణామం అన్నారు. అబ్దుల్ కలాం శాస్త్రవేత్తగానే కాకుండా దూర దృష్టి గల నాయకుడని ఆయన సేవలను కొనియాడారు. ప్రపంచ దేశాలు బారతదేశాన్ని గౌరవంగా చూసేలా చేసి వ్యక్తి అని ఆయన జీవితమంతా క్రమశిక్షణ, జ్ఞానం, కృషికి ప్రతీక అని నేటి యువత కలాం జీవితం నుండి స్పూర్తి పొంది దేశ అభివృద్ధి దిశగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు సునీల్ రెడ్డి మాట్లాడుతూ భావిత రాలకు ఉజ్వల భవిష్యత్తు అందించాలన్న తపనతో కలలు కనండి- వాటిని సాకారం చేసుకోండి అంటూ ఆయన ఇచ్చిన సందేశాలు యువ తకు స్పూర్తిదాయకమన్నారు. బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, మైనార్టీ యువ మోర్చరాష్ట్ర అధ్యక్షులుసయ్యద్‌బాష,ఎస్‌సిమోర్చరాష్ట్ర అధ్యక్షుడు పనతలసురేష్,నేతలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదోని నుంచి శబరిమలకు అయ్యప్ప స్వాముల మహా పాదయాత్ర

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** ఆదోని నుంచి అయ్యప్పస్వామి దీక్షాపరులుశబరిమల ఆలయానికి మహా పాదయాత్రగా బయలుదేరారు. బుధవారం స్థానిక ఎస్కేడి కాలనీలోని అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి స్వామియే శరణం అయ్యప్పా.. అంటూ అయ్యప్ప నామ స్మరణలను చేస్తూ స్వాములు కాలినడకను ప్రారంభించారు. దారి పొడవునా కొందరు భక్తులు దీక్షాస్వామిల పాదాలకు భక్తిశ్రద్ధలతో నిండు బిందెలతో నీళ్లు పోసి కొబ్బరికాయలను కొట్టి తమ భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా మండిగిరి టీడీపీ ఇంచార్జ్ శ్రీనివాస ఆచారి గురుస్వామి మాట్లాడుతూ.. లోక కళ్యాణార్థం, ఆదోని ప్రజలు, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, అలాగే అందరూ బాగుండాలన్న ఉద్దేశ్యంతో దాదాపు 20 ఏళ్ళుగా అయ్యప్ప స్వామి మాలతో స్వామివారిని దర్శించుకున్న భాగ్యాన్ని పొందామన్నారు. గడిచిన 16 ఏళ్ళుగా ఆదోని నుంచి శబరిమలకు నిర్విఘ్నంగా పాదయాత్రను పూర్తి చేసి, ప్రస్తుతం 17వ పాదయాత్రను



శబరిమలకు కాలినడకన బయలుదేరిన అయ్యప్పస్వాములు

కూడా కొనసాగిస్తున్నామని తెలిపారు. రోజుకు 30కిలోమీటర్లకు పైగా కాలినడకతో కేరళలోని శబరిమలై ఆలయానికి చేరుకుని అయ్యప్ప స్వామి వారికి ఇరుముడిని సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకుంటామన్నారు. వీరి వెంట పాదయాత్రలో అయ్యప్పదీక్ష పరులు పాల్గొన్నారు.

## కర్నూలు లో ప్రధానమంత్రి పర్యటన

**-వాహనాలకు ట్రాఫిక్ మళ్ళింపు-కర్నూలు జిల్లా ప్రజలు సహకరించాలి..**

**-జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్**

**కర్నూల్ క్రైమ్ మేజర్ న్యూస్ :** భారత ప్రధానమంత్రి కర్నూలుకు విచ్చేస్తున్న సందర్భంగా గురువారం ఉదయం8.00 నుండి రాత్రి 9.00 గంటల వరకు కర్నూలు మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్ళవలసిన వాహనాలకు ట్రాఫిక్ మళ్లింపు ఈ క్రింద విధంగా ఉంటుంది.

**కడప నుండి కర్నూలు మీదుగా హైదరాబాదు వైపుకు వెళ్లే వాహనాలు :** పాణ్యం,గడివేముల, మిడ్తూరు, బ్రాహ్మణ కొట్కూరు, కోల్లబాపురం, పూడూరు, అలంపూర్ బ్రిడ్జి, అలంపూర్ చౌరస్తా నుండి హైదరాబాదు వైపు వెళుతాయన్నారు.

**కడప నుండి కర్నూలు వైపు వెళ్ళే వాహనాలు :** పాణ్యం, మిడ్తూరు, నందికొట్కూరు, కోల్లబాపురం, పూడూరు, అలంపూర్ బ్రిడ్జి, అలంపూర్ చౌరస్తా నుండి కర్నూలు కు చేరుకుంటాయన్నారు.

**నంద్యాల నుండి బెంగళూరు వైపు వెళ్ళే వాహనాలు :** పాణ్యం, బనగానపల్లె, ఎన్.రాచర్ల, డోన్, బెంగళూరు,పాణ్యం,తమ్మరాజు పల్లె, బేతంచెర్ల, డోన్, బెంగళూరు, సోమయాజు లపల్లె, బేతంచెర్ల, డోన్, బెంగళూరు

**శ్రీశైలం నుండి కర్నూలు రోడ్డు ఆత్మకూరు నుండి అనంతపురం వైపు వెళ్ళు వాహనాలు :** ఆత్మకూరు-బండి ఆత్మకూరు, పాణ్యం, బనగానపల్లె, ఎన్.రాచర్ల, డోన్, అనంతపురం మీదుగా వెళతాయి.

**ఆత్మకూరు నుండి బళ్ళారి వైపు వెళ్ళు వాహనాలు :** ఆత్మకూరు - బ్రాహ్మణకొట్కూరు, కోల్లబాపురం, పూడూరు, ఆలంపూర్ బ్రిడ్జి ,ఆలంపూర్ చౌరస్తా, శాంతినగర్, బళ్ళారి మీదుగా వెళతాయి.

**అనంతపురము నుండి హైదరాబాదు వైపు వెళ్ళు వాహనాలు :** గుత్తి-జొన్నగిరి, తుగ్గలి, పత్తికొండ, ఆస్పరి, ఆదోని, మంత్రాలయం, మాధవరం, రాయచూరు, హైదరాబాదు మీదుగా వెళతాయి.గుత్తి - జొన్నగిరి, తుగ్గలి, పత్తికొండ, ఆస్పరి, ఆదోని, ఎమ్మిగనూరు, నందవరం, నాగలదిన్నె, ఐజ, హైదరాబాదు మీదుగా వెళతాయి.

**అనంతపురం నుండి నంద్యాల వైపు వైపు వెళ్ళు వాహనాలు :** అనంతపురము - ప్యాపిలి, ఎన్.రాచర్ల, బనగానపల్లె, పాణ్యం, నంద్యాల డోన్ - బనగానపల్లె, నంద్యాల మీదుగా వెళతాయి.

**బళ్ళారి నుండి హైదరాబాదు వైపు వెళ్ళు వాహనాలు :** ధనాపురం క్రాస్ -ఆదోని,మాధవరం, రాయచూరు, హైదరాబాదు ,ఆదోని సిరిగుప్ప చెక్ పోస్టు - ఆదోని, ఎమ్మిగనూరు, నందవరం, నాగలదిన్నె, ఐజ, శాంతినగర్,ఉల్చాల వై జంక్షన్ - ఎల్కూరు బంగ్లా, విష్ణు టౌన్ షాపు, సంతోష్ నగర్ మీదుగా వెళతాయన్నారు.

**నంద్యాల నుండి కర్నూలు వైపు వెళ్ళే వాహనాలు :** తమ్మరాజుపల్లి, బేతంచెర్ల, డోన్, కర్నూలు ,తమ్మరాజుపల్లి, కాల్వబుగ్గ, ఎంబాయి, రామళ్లకోట, వెల్దుర్తి, కర్నూలు మీదుగా వెళతాయన్నారు.

**ఓర్వకల్లు నుండి హైదరాబాదు వైపు వెళ్ళే వాహనాలు :** ఓర్వకల్లు కన్నమడకల, చౌట్కూరు, కడుమూరు, మిడ్తూరు, నందికొట్కూరు, హైదరాబాదు,పూడిచెర్ల, కేతవరం, గార్గేయపురం, బ్రాహ్మణకొట్కూరు, హైదరాబాదు ,ఎల్లమ్మగుడి, పడిదెంపాడు, పూడూరు, ర్యాలంపాడు, ఆలంపూరు మీదుగా వాహనాలు వెళుతాయన్నారు.

పలు చోట్ల కార్యక్రమం ముగిసేంత వరకు లారీలు, ఇతర భారీ వాహనాలు ఉదయం 8.00 నుండి రాత్రి 9.00 గంటల వరకు ఆపివేయబడును.కావున కర్నూలు పట్టణం మీదుగా ప్రయాణం చేయదలచిన వారు పై తెలిపిన ట్రాఫిక్ మళ్లింపు ను దృష్టిలో ఉంచుకొని పోలీసువారికిసహకరించవలసిందిగా కర్నూలు జిల్లా ఎస్.పి. విక్రాంత్ పాటిల్, తెలిపారు.

## మంత్రి నారా లోకేష్ కృషే ఏపీకి గూగుల్

**ఏపి విత్తనాభివృద్ధి కార్పోరేషన్ చైర్మెన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి**



**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్‌:** గూగుల్ సంస్థను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీసుకురావడానికి మంత్రి నారా లోకేష్ చేసిన కృషి ఫలితమేననీ ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి మాట్లాడుతూ గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్‌తో ఒప్పందం కుదుర్చుకొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటి, విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌లు రాష్ట్ర చరిత్రలో సువర్ణాధ్యాయానికి నాంది పలికారన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గూగుల్ సంస్థ పెట్టుబడులు తీసుకురావడానికి కీలకపాత్ర పోషించిన నారా లోకేష్‌కు ఆయన అభివనందనలు తెలిపారు. గూగుల్ రావడం ఏపి భవిష్యత్తు, అభివృద్ధి, కేంద్రీకరణ మాటలకే పరిమితం కాకుండా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తుందన్నారు.

## గిరిజన గురుకుల బాలికల హాస్టల్‌లో మంత్రి ఆకస్మిక తనిఖీ

**-సౌకర్యాలపై విద్యార్థినులతో ముచ్చటించిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి**



**కర్నూలు స్పోర్ట్స్ మేజర్ న్యూస్:** కల్లూరు మండలంలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల ఉన్నత పాఠశాల హాస్టల్‌ను రాష్ట్ర స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో విద్యార్థినులు పొందుతున్న సౌకర్యాలు, వసతి, భోజన నాణ్యత, ఆరోగ్య సదుపాయాలు, పాఠశాల వాతావరణం తదితర అంశాలను ఆమె వివరంగా పరిశీలించారు.మంత్రి విద్యార్థినులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ, చదువులో ఎటువంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు అందిస్తున్న సౌకర్యాలతో సంతృప్తిగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి ఉపాధ్యాయుల స్థానంలో నిలిచి కాసేపు విద్యార్థినులను ప్రశ్నలతో పరీక్షించి, వారికి ప్రోత్సాహం అందించారు.బాలికల విద్య, భద్రత, సంక్షేమం పట్ల ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆమె పేర్కొన్నారు. "గిరిజన బాలికలు ఉన్నత విద్య ద్వారా సమాజ మార్పుకు దారితీయాలని ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోంది" అని మంత్రి సంధ్యారాణి అన్నారు. అవసరమైన చోట సదుపాయాల మెరుగుదలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.తనిఖీ సందర్భంగా స్థానిక అధికారులు, గురుకుల సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి కార్యక్రమం విజయవంతం చేసేలా అన్ని చర్యలు

**:- ప్రధానమంత్రి స్పెషల్ ప్రోగ్రాం ఆఫీసర్, సీనియర్ ఐఏఎస్ వీరపాండియన్**

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ప్రధానమంత్రి కార్యక్రమం విజయవంతం చేసేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ప్రధానమంత్రి స్పెషల్ ప్రోగ్రాం ఆఫీసర్, సీనియర్ ఐఏఎస్ వీరపాండియన్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వివరించారు. దేశ ప్రధాని మోడీ కర్నూలు జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా జిల్లాలో చేస్తున్న ఏర్పాట్లపై సిఎం చంద్రబాబునాయుడు విజయవాడ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధానమంత్రి స్పెషల్ ప్రోగ్రాం ఆఫీసర్, సీనియర్ ఐఏఎస్ వీరపాండియన్, కలెక్టర్ డా.ఏ సిరిలతో సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రి స్పెషల్ ప్రోగ్రాం ఆఫీసర్ ఏర్పాట్ల గురించి వివరిస్తూ వేదిక మీద చేస్తున్న ఏర్పాట్లు, ప్రధాని హెలిప్యాడ్ ఏర్పాట్లు, ముఖ్యమంత్రి హెలిప్యాడ్ ఏర్పాట్ల వివరాల గురించి, బ్యాక్ డ్రాప్ డిజైన్ గురించి సిఎంకి వివరించారు. బుధవారం రిహార్సల్ కార్యక్రమం నిర్వహించుకున్నామని తెలిపారు. ప్రజలకు ఏర్పాటు చేస్తున్న భోజన సదుపాయం, తాగునీరు గురించి వివరించారు. కలెక్టర్ డా.ఏ సిరి ప్రధాని పర్యటనకి సంబంధించి చేస్తున్న ఏర్పాట్ల గురించి సిఎంకి వివరిస్తూ ప్రధానమంత్రికి 3హెలిప్యాడ్‌లు, ముఖ్యమంత్రికి 2 హెలిప్యాడ్ నిర్మాణాలు 100శాతం పూర్తయ్యాయని అందుకు సంబంధించిన బారికేడింగ్ పనులు కూడా పూర్తయ్యాయన్నారు. పార్కింగ్ ప్రదేశంలో టాయిలెట్, విద్యుత్, హెల్ప్ డెస్కలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సౌండ్ సిస్టమ్ ఏర్పాట్లు కూడా వెరిఫై చేసుకుంటున్నామన్నారు. విద్యుత్, తాగునీరు, ఆసుపత్రులు, అంబులెన్స్ ఏర్పాట్లు, స్పెషలిస్ట్ డాక్టర్ ఏర్పాటు గురించి సిఎంకి వివరించారు. అలాగే జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ప్రధాని పర్యటనకు సంబంధించి తీసుకుంటున్న భద్రతా చర్యల గురించి సిఎంకి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐఏఎస్ అధికారి దినేష్, విజయ సునీత, ఢిల్లీ రావు, శౌర్య మాన్ పటేల్, జెసి నూరుల్ కమర్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ట్రైనీ కలెక్టర్ సందీప్, రఘువంశీ, సచిన్ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి



మాట్లాడుతున్న కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎ. సూర్య ప్రకాష్ రెడ్డి

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎ సూర్య ప్రకాష్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని మోడీ జీఎస్టి విషయంలో ఘోరం గా విఫలమయ్యారని గడిచిన ఏనిమిదేళ్లు దేశ ప్రజలపైన జీఎస్టిని బాది ఇప్పుడు జీఎస్టిని తగ్గించామని చెప్పి సంబరాలు చేసుకోవడానికి కర్నూలుకు రావడం సరైంది కాదన్నారు. 2014లో తిరుపతి సభలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చారని, బుందేల్‌ఖండ్ తరహాలో స్పెషల్ ప్యాకేజీ ఇస్తామన్నారు కానీ ఏదీ చేయలేదని మండిపడ్డారు. కేవలం జీఎస్టి వల్ల సామాన్య ప్రజలకు నష్టం జరిగింది కానీ ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. కర్నూలు జిల్లాలో రైతాంగం సస్యశ్యామలంగా ఉండాలంటే వేదావతి, గుండ్రేవుల ప్రాజెక్టులు పూర్తి చేయాలని, జిలా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బతుకన్న, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రాఘవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలలో తిరుగుబాటు మొదలైంది


సంతకాల సేకరణ చేపడుతున్న వైసిపి నాయకులు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం తీసుకువస్తున్న ప్రైవేటీకరణపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్వి మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కళాశాల ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నగరంలోని 1వ వార్డు నందు వైసిపి నేతలు సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వి మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా వైద్య వ్యవస్థను ప్రైవేటు చేతుల్లోకి వెళ్లనివ్వకూడదన్న జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రచ్చబండ కార్యక్రమం ద్వారా కోటి సంతకాల సేకరణను ప్రారంభించామన్నారు. గ్రామస్థాయిలో పార్టీ కమిటీల ద్వారా వైసిపి క్రమబద్ధంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రతిఒక్క నాయకుడు, కార్యకర్త తమ గ్రామాన్ని బాధ్యతగా తీసుకుని ప్రజలతో కలిసి ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కెఎంసి మేయర్ బివై రామయ్య, వైకాపా నాయకురాలు విజయ మనోహరిలు మాట్లాడుతూ కలిసికట్టుగా పనిచేసి రాబోయే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవడం మనందరి బాధ్యత అన్నారు. కళాశాలల ప్రైవేటీకరణకు వైసిపి చెక్ పెడుతుందన్నారు.

## సుగాలి ప్రీతి కేసులో న్యాయం ఎక్కడ..?

**:- ఎనిమిదేళ్లుగా ఆవేదనలో తల్లి**



మౌన నిరసన చేస్తున్న పార్వతిభాయ్, ప్రజా సంఘాల నాయకులు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** మైనర్ గిరిజన బాలిక సుగాలి ప్రీతి అత్యాచార హత్య ఘటనకు ఎనిమిదేళ్లు గడిచినా న్యాయం జరగలేదని బాధితురాలి తల్లి పార్వతి భాయ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం వద్ద ఆమె ప్రజాసంఘాల నాయకులతో కలిసి మౌన నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతి భాయ్ మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా మేము న్యాయం కోసం తిరుగుతున్నామని ఆధారాలు ఉన్నా, ప్రభుత్వాలు న్యాయం చేయడం లేదన్నారు. అధికారులు, మంత్రులు ఎవరూ పట్టించుకోవడం లేదని, నేడు కర్నూలు జిల్లాలో పర్యటించనున్న ప్రధాని మోడీ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లాలనుకున్నా కానీ జిల్లా అధికారులు మోడీభేటీకిఅనుమతి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ బేటీ బచావో..బేటీ పడావో.. అంటుంటే మా బేటీకి న్యాయం ఎక్కడ..?అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు సుగాలి ప్రీతి కేసులో న్యాయ పోరాటానికి తాను సిద్ధమని చెప్పిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పూర్తిగా మౌనం వహిస్తున్నారని ఆమె విమర్శించారు. ప్రభుత్వం అన్నివిధాల న్యాయం చేసిందని పవన్ కళ్యాణ్ చెప్పడం బాధిత కుటుంబాన్ని అవమానపరచడమే అని అన్నారు. జీఓ ప్రకారం కొంత సహాయం ఇచ్చినప్పటికీ పూర్తి న్యాయం జరగలేదని తెలిపారు. మా కుమార్తెకు న్యాయం చేయకపోగా ముద్దాయిలను కాపాడుతున్న ప్రభుత్వం సిగ్గుపడాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు సుగాలి ప్రీతి కేసు విచారణను వేగవంతం చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## విభజన హామీలు నెరవేర్చాలి

**మంత్రాలయం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ ఇంచార్జీ భాస్కర్ యాదవ్, సీపీఎం నాయకులు జైరాజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంత్రాలయం మండల కేంద్రంలో బుధవారం వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గో బ్యాక్ నరేంద్రమోడీ అనే కార్యక్రమంలోభాగంగా, అంబేద్కర్‌సర్కిల్ నుండి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నిధులు కేటాయించాలన్నారు. రాయలసీమకు తాగు, సాగునీరు, పెండింగ్ ప్రాజెక్టులు నిర్మించి నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు జాఫర్, రాజు, అనీల్, దానియేల్, ఏలిసా, ప్రాణేష్, ఆంధ్రయ్య, శేక్షావలి, మహ్మద్, రాహుల్, లక్ష్మణ్ నాయక్, గాబ్రేల్, తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు న్యాయం చేస్తాను.. ఎమ్మెల్యే అఖిలప్రియ

**-బాధితులకు ఎవరి డబ్బులు వారికి ఇప్పిస్తాను**
**-వైకాపా నీచ రాజకీయాలు చేస్తుంది ..ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ**


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్:** వెల్త్ అండ్ హెల్త్ ఫైనాన్స్ సొల్యూషన్ సంస్థ ద్వారా మోసపోయిన బాధితులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ సంస్థను హైదరాబాదులో ఏర్పాటు చేసి దొర్నిపాడు, చాగలమర్రి, కడప, అనంతపురం ప్రాంతాల వారితో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు తీసుకొని మోసం చేశారన్నారు. గ్రామానికి చెందిన వీరారెడ్డి, రాజారెడ్డి, మహేశ్వర్ రెడ్డిలు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ప్రజల్ని మోసం చేశారన్నారు. రెండు సంవత్సరాల నుంచి ప్రతి ఒక్కరితో 3.6 లక్షలు కట్టించుకుని నెలకు 40 వేల రూపాయలు వారి అకౌంట్లో వేస్తూ దాదాపు 3,000 మంది వద్ద నుంచి డబ్బులు తీసుకోవడం జరిగిందన్నారు. డబ్బులు కట్టిన బాధితులు అకౌంట్లో డబ్బులు పడకపోవడంతో మోసపోయామని గ్రహించి ధర్నాకు కూర్చున్నారన్నారు. బాధితులకు న్యాయం చేసేలాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హోం మంత్రి అనితతో మాట్లాడడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి ప్రోగ్రాం అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటారని, ఇప్పటికే మూడు టీములుగా తిరుగుతున్నారని కచ్చితంగా వారిని పట్టుకుని బాధిత కుటుంబాలకు డబ్బులు వచ్చేలాగా చేస్తామన్నారు. ఈ స్కాంలో కీలకపాత్ర పోషించిన మహేశ్వర్ రెడ్డి ఎన్నికలకు రెండు నెలల ముందు వరకు వైకాపాలోనే ఉన్నారన్నారు. వైకాపా హయాంలోనే సంస్థను ఏర్పాటుచేసి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశారన్నారు. వైకాపా నీచ రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. ప్రస్తుతం జరుగుతున్న నిరసన వెనుక వైకాపా నాయకుల కుట్ర ఉందన్నారు. నిందితులుఎవరితో ఉన్నావదల పెట్టబోమన్నారు. మహేశ్వర్ రెడ్డిని పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని టిడిపి అధ్యక్షుడికి లేఖ రాశామన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టే వారిని పార్టీలో పెట్టుకోమ న్నారు. ప్రజలు కూడా ఉద్యోగాల కోసం ఎవరికి డబ్బులు ఇచ్చిమోసపోవద్దని సూచిం చారు. ఎలాంటి అర్హత లేకుండానే నెలకు నలభై వేలు ఎలాఇస్తారన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ప్రధానమంత్రి పర్యటన అనంతరం బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## పీఎం పర్యటనను చారిత్రాత్మకంగా చేద్దాం- మంత్రుల బృందం


మంత్రుల బృందం, పార్టీ నాయకులతో ఉన్నతస్థాయి సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండి ఫరూక్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** రాయలసీమ అభివృద్ధికి కేంద్ర బిందువైన ఉమ్మడి కర్నూలు జిల్లాలో అక్టోబర్ 16వ తేదీన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన ఏర్పాట్లపై చర్చించేందుకు రాష్ట్ర మంత్రుల ఉన్నతస్థాయి బృందం నంద్యాలకు చేరుకుంది. ఈ చారిత్రాత్మక పర్యటనను విజయవంతం చేసే కార్యాచరణపై చర్చించేందుకు నంద్యాలలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంత్రుల బృందం పార్టీ ముఖ్య నాయకులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించింది. ఈసమావేశంలో మంత్రులు న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, ఏలూరు ఎమ్మెల్యే రాధాకృష్ణ, శాప్ చైర్మన్ రవినాయుడు, నంద్యాల నియోజకవర్గ పరిశీలకులు ఆలం నర్సంనాయుడు పాల్గొన్నారు. ఈసందర్భంగామంత్రులు సంయుక్తంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, ముఖ్యంగా రాయలసీమ ప్రగతికి పెద్దపీట వేస్తున్న పీఎం నరేంద్ర మోదీ మన ప్రాంతానికి రావడం అత్యంత సంతోషదాయకమని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వంలో డబుల్ ఇంజన్ సర్కార్ వేగంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి ఈ పర్యటన మరింత ఉత్తేజాన్ని ఇస్తుందన్నారు. ప్రధానమంత్రి సభకు ఉమ్మడి కర్నూలు జిల్లా నలుమూలల నుంచి లక్షలాదిగా తరలివచ్చే ప్రజలు, అభిమానులు, పార్టీ కార్యకర్తలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించడం జరిగిందన్నారు. పోలీస్, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనను విజయవంతం చేయడానికి క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు ఎలా పనిచేయాలనే దానిపై మంత్రులు దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామం నుంచి ప్రజలను చైతన్యవంతం చేసి సభకు తరలించే బాధ్యతలను నాయకులు తీసుకోవాలని పిలుపునిచ్చారు ఈ పర్యటన కేవలం ఒక రాజకీయ సభ కాదని వెనుకబడిన రాయలసీమ ప్రాంత అభివృద్ధికి ఒక నూతన అధ్యాయం కానుందని మంత్రులు అభిప్రాయపడ్డారు. పధానమంత్రి పర్యటన ద్వారా ఈ ప్రాంతానికి నూతన పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ లభిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాయలసీమ ప్రజల తరపున అపూర్వమైన, చారిత్రాత్మక స్వాగతం పలకడానికి తామంతా సిద్ధంగా ఉన్నామని మంత్రుల బృందం స్పష్టం చేసింది. ఈకార్యక్రమంలో నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు రామచంద్రరావు, ఏవిఆర్ ప్రసాద్, కౌన్సిలర్లు ఖండే శ్యామ్‌సుందర్‌లాల్, శ్రీదేవి, జైనాబి, గోస్పాడు మండల కన్వీనర్ తులసీశ్వర్‌రెడ్డి, నంద్యాల మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, కమిషనర్ శేషన్న, తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయని మోడీ పర్యటన దేని కోసం..?

**కర్నూలు జడ్‌పి, మేజర్‌న్యూస్ :** రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం అనే అంశాలు విభజన హామీలో ఉన్నప్పటికీ వాటిని అమలు చేయకుండా ఏ మొహం పెట్టుకుని ప్రధాని మోడీ కర్నూలు జిల్లా పర్యటన చేస్తున్నాడని, ఏ మొహం పెట్టుకుని సిఎం చంద్రబాబునాయుడు ఆహ్వానిస్తున్నాడని వామపక్ష నాయకులు సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, ఎస్‌యూసిఐ రాష్ట్ర నాయకులు రాఘవేంద్రలు సూటిగా ప్రశ్నించారు. నేడు ప్రధాని మోడీ కర్నూలు జిల్లా పర్యటనను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా బుధవారం నగరంలోని స్థానిక జిల్లా పరిషత్ కాంపౌండ్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు నల్ల జెండాలతో భారీ నిరసన ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీనివాసరావు, రామచంద్రయ్య, రాఘవేంద్రలు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో రాష్ట్రానికి ద్రోహం చేసిన మోడీ గోబ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కర్నూలు జిల్లా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కొరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వని ప్రధాని జిల్లాకు ఏమి ఒరగబెట్టడానికి వస్తున్నాడని కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమం సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అధ్యక్షతన జరిగింద. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోడీ జీఎస్టి సంబరాల సభలో పాల్గొనడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని తీవ్రంగా విమర్శించారు. ఎనిమిదేళ్ల పాటు ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పి చేసిన తర్వాత నేను జీఎస్టి తగ్గించాను అని సంబరాలు జరుపుకోండని చెప్పడాన్ని ఏమనాలని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు జీఎస్టి తగ్గడం వల్ల రూ.15వేలు మిగులుతుందని ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబులు అంటున్నారు కదా అదే నిజమైతే ఈ ఏనిమిదేళ్ల పాటు ప్రతి ఒక్కరికి రూ.15వేలు భారం వేసినట్లే కదా దీనికి సమాధానం చెప్పాలన్నారు. ప్రజాధనాన్ని వృధా చేస్తూ సంబరాలు జరుపుకోవడం దుర్మార్గమైన చర్య అని దీనిని ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు, సాగునీటి ప్రాజెక్టుల కోసం నిధులు కేటాయించడం కోసం సిఎం చంద్రబాబునాయుడు ప్రధానిపై ఒత్తిడి తేవాలని వారు కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు మల్లికార్జున, నాగరాజు, సిపిఎం నగర కార్యదర్శులు రాముడు, రాజశేఖర్, సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సిపిఎం జిల్లా నాయకులు నిర్మల రాధాకృష్ణ, రామకృష్ణ, నారాయణ, సిపిఐ జిల్లా నాయకులు మునెప్ప, లెనిన్ బాబు, రసూల్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

# గ్రామ పంచాయతీ కార్యదర్శుల రీ-కేటగిరైజేషన్‌పై హర్షం

**-హర్షం వ్యక్తం చేసిన ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప**



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** గ్రామ పంచాయతీ కార్యదర్శుల రీ-కేటగిరైజేషన్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో ఆమోదం తెలిపిన సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం నంద్యాల జిల్లా యూనిట్ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులతో కలిసి పాలాభిషేకం చేశారు. నంద్యాల జిల్లా సంఘ అధ్యక్షుడు యశ్వంత్ కుమార్ బాయికాటి మాట్లాడుతూ.. గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రస్తుత ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలు మిస్సైల్ మాన్ డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం ఆశయాలకు అనుగుణంగా ఉన్నాయని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రీ-కేటగిరైజేషన్ ఫైల్ కేబినెట్ ఆమోదం పొందడం ఎంతో సంతోషకర పరిణామమని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ కార్యదర్శి" అనే పేరు "పంచాయతీ అభివృద్ధి అధికారి గా మార్చగా, ఇప్పటి వరకు ఉన్న ఐదు గ్రేడ్లను స్పెషల్ గ్రేడ్, 1, 2, 3 గ్రేడ్లుగా పునర్విభజించడం ద్వారా త్వరిత ప్రమోషన్ అవకాశాలు లభించనున్నాయని వివరించారు. దీని వల్ల సంవత్సరాలుగా పదోన్నతి కోసం ఎదురుచూస్తున్న పంచాయతీ కార్యదర్శులకు ఇది ఎంతో ఆనందదాయకమని అన్నారు. ఈ నిర్ణయాల అమల్లో పాత్ర వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రిన్సిపల్ సెక్రటరీ, పంచాయతీ రాజ్ కమిషనర్, ఓఎస్‌డీ వెంకటకృష్ణకు సంఘం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప, కోశాధికారి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్ కుమార్ బాయికాటి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కార్యదర్శులు వేదవతి, రాజశేఖర్, పరమేష్, భాస్కర్, షాహినూర్, ఆరిఫ్, రంగడు శంకర్ నాయక్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.ఆర్.పి.ఎస్, ఎం.ఎస్.పి నాయకులు

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్:** సుప్రీంకోర్ట్ సి.జె.ఐ బి.ఆర్ గవాయ్ దళితుడు కావడం వలనే అహంకారంతో దాడి జరిగిందని ఇది ఒక దళిత వ్యక్తిపై జరిగిన దాడి కాదని ప్రజాస్వామ్యంపై న్యాయవ్యవస్థపై రాజ్యాంగంపై జరిగిన దాడిగా భావిస్తూ ఈ దాడికి పాల్పడిన వ్యక్తులైన వారిని ప్రోత్సహించిన శక్తులు ఎవరైనా వారికి శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని అలాగే భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగక్కుండా ఉండేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల అనగా 17.10.2025న ఎం.ఆర్.పి.ఎస్, ఎం.ఎస్.పి మరియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కొలిమిగుండ్ల మండల కేంద్రంలో నిరసన తెల్పడం జరుగుతుందని మండల ఎం.ఆర్.పి.ఎస్, ఎం.ఎస్.పి మరియు గోపాల్ దస్తగిరి మాదిగ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించే నిరసన ప్రదర్శనకు మండలంలో అన్ని గ్రామాల నుండి ఎం.ఆర్.పి.ఎస్, ఎం.ఎస్.పి అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ తరలి రావాలని వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంద వెంకటేశ్వర్లు మాదిగ, తోళ్ల వెంకట్రామయ్య మాదిగ, తోల్ల మోహన్ మాదిగ, సీకాయి చంద్ర మాదిగ, లింగాల దస్తగిరి మాదిగ, గోపాల్ , గణేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# మోడీ పర్యటనకు సర్వం సిద్ధం

**- అందరి దృష్టి ఉమ్మడి కర్నూలు జిల్లాపై**
**- రాష్ట్రానికి వరాలు ప్రకటనపై సర్వత్రా ఆసక్తి**
**- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కూటమి ప్రభుత్వం**
**- నమో సభపై భారీ అంచనాలు**

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** దేశ ప్రధాని హోదాలో మోడీ ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనకు సర్వం సిద్ధమైంది. దేశ ప్రధాని ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటిస్తుండటంతో అందరి దృష్టి జిల్లాపై ఉంది. కేంద్రం జీఎస్టీని తగ్గించిన తరువాత మోడీ రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తుండటంతో రాష్ట్రానికి వరాలు ప్రకటించే అవకాశం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రధాని ప్రకటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కూటమి ప్రభుత్వం ప్రధాని పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గడిచిన నాలుగు రోజులుగా తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల రాష్ట్ర అధ్యక్షులతో పాటు మంత్రులు ఉమ్మడి కర్నూలు జిల్లాలో తిష్టవేశారు. కూటమి ప్రభుత్వం విస్తృతమైన ఏర్పాట్లును చేసింది. నంద్యాల జిల్లాలో జ్యోతిర్లింగం, అష్టాదశ పీఠం ఒకే చోట కొలువుతీరిన శ్రీశైలం మల్లన్నను మోడీ దర్శించుకోనున్నారు. శ్రీశైలంలోని ఛత్రపతి శివాజి ఆధ్యాత్మిక క్షేత్రంలోని శివాజి ధ్యానం చేసిన స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించనున్నారు. ప్రధాని పర్యటనతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో వాహనాల రాకపోకలను దారి మళ్లించారు. గడిచిన వారం రోజులుగా నల్లమలను గ్రేహౌండ్స్ దళాలు జల్లెడ పడుతున్నాయి. మల్లన్న దర్శించుకునేందుకు ప్రధాని వస్తుండటంతో భక్తుల సందర్శన వేళల్లో మార్పులు చేశారు. ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి ప్రధాని ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో శ్రీశైలానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రధాని కర్నూలు జిల్లా పర్యటనకు వెళతారు. ఓర్వకల్లు మండలంలోని నన్నూరు వద్ద నమో సభ పేరుతో బహిరంగ సభలో ప్రధాని పాల్గొంటారు. సభకు ముఖ్యమంత్రితో పాటు ఉపముఖ్యమంత్రి, మంత్రులు, ఆయా పార్టీల అధ్యక్షులు పాల్గొననున్నారు. విమానాశ్రయం నుంచి బహిరంగ సభ ప్రాంగణం వరకు ర్యాలీతో ప్రధాని మోడీ బహిరంగ సభకు చేరుకుంటారు. అక్కడే రూ.13,429 కోట్లతో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. వాటిని జాతికి అంకితం చేస్తారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ పేరిట పర్యటన జరగనున్నది. సభలో రాష్ట్రానికి మరిన్ని వరాలను కురిపించే అవకాశం లేకపోలేదని కూటమి నేతలు భావిస్తున్నారు. ప్రధాని పర్యటన కావడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. సాక్షాత్తు డీజీపీ గుప్త ప్రధాని పర్యటించే ప్రాంతాలను సందర్శించి ఏర్పాట్లును నిశితంగా పరిశీలించారు. కేంద్ర బలగాలు ఇప్పటికే జిల్లాకు చేరుకొని ఆయా ప్రాంగణాలను తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. బహిరంగ సభకు 3 లక్షలపై చిలుకు జనాభా వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందు కోసం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి, ప్రతి వార్డుకు వాహన సౌకర్యాలను కల్పించారు. రెండు రోజులు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. సభ తరువాత ప్రజలు సురక్షితంగా గమ్య స్తానాలకు చేరుకునేలా ప్రభుత్వం యంత్రాంగం అన్ని ఏర్పాట్లును చేసింది.

## శ్రీశైలంలో ప్రధాని కాన్వాయ్ రిహార్సల్స్

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** ప్రధాని మోదీ రేపు శ్రీశైలం రానున్న సందర్భంగా ఆయన కాన్వాయ్ రిహార్సల్స్ను బుధవారం నిర్వహించారు. సున్నిపెంట హెలీప్యాడ్ గ్రౌండ్ నుంచి శ్రీశైలంలో ప్రధాని పర్యటించే ప్రాంతాల్లో కాన్వాయ్ రిహార్సల్స్ను చేపట్టారు. అలాగే సీఎం, డిప్యూటీ సీఎం కాన్వాయ్ రిహార్సలూ నిర్వహించారు. శ్రీశైలం పరిసరాలు భద్రతా బలగాల పహారా నడుమ కొనసాగుతున్నాయి. డేగ కన్నుతో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.



# కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలి- న్యాయవాదుల నిరసన



కోర్టు వద్ద నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

**పత్తికొండ, మేజర్ న్యూస్ :** కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుబాబు పేర్కొన్నారు. బుధవారం పత్తికొండ పట్టణంలోని జూనియర్‌సివిల్ కోర్టు వద్ద బార్ అసోసియేషన్ అధ్యక్షులు మధుబాబు ఆధ్వర్యంలో న్యాయవాదుల నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని బుధ, గురువారాల్లో కోర్టు విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ఇంత వరకు ఏటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు నాగేష్, నారాయణస్వామి, పంపాపతి, కృష్ణయ్య, నరసింహాచారి, దామో దాచారి, శ్రీకాంత్‌రెడ్డి,కారంనాగరాజు, భాస్కర్, మోనయ్య, అరుణ్, మధు, హరి, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ గురువును సత్కరించిన విద్యార్థులు



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎ పి.జె.అబ్దుల్ కలాం జయంతి వేడుకలను నంద్యాల పట్టణంలోని రమణి మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాల కాన్ఫరెన్స్ హాలులో డాక్టర్ గురు ప్రసాద్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అబ్దుల్ కలాం చిత్రపటానికి పుష్పగుచ్చాలతో నివాలులర్పించారు. ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న బలపనూరు ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు అవ్వారి శేషఫణిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దంత వైద్యుడు డాక్టర్" గురుప్రసాద్ మాట్లాడుతూ క్రమశిక్షణ,నిబద్ధతతో విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి కృషిచేసిన ఉపాధ్యాయులు శేషఫణి విద్యార్థులకు మార్గదర్శిగా నిలిచారని కొనియాడారు. ముఖ్య అతిథి డెంటల్‌అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ గురువు ప్రభావం జీవితాంతం నిలచి పోతుందని విద్యార్థుల సంపూర్ణ మూర్తిమత్వానికి దోహదం చేసిన ఉపాధ్యాయులు శేషఫణి అభినందనీయుడన్నారు. సన్మాన గ్రహీత శేషఫణి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులలో సేవాభావాన్ని సృజనాత్మకతను పెంచడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. జ్ఞానం పంచడం కన్నా గొప్ప సంతోషం లేదని విద్యార్థుల విజయాలు సాధించినప్పుడే గురువులకు నిజమైన పురస్కారం లభించినట్లని పేర్కొన్నారు. శారదావిద్యానికేతన్ పూర్వ విద్యార్థులు జ్ఞానం పంచిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకొని సత్కరించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఏ.పి.జె. అబ్దుల్ కలాం జన్మదినాన్ని "విద్యార్థి దినోత్సవం"గా నిర్వహించుకోవడం గర్వకారణం అని విద్యార్థులు గురువుల మార్గదర్శకత్వంలో విలువలతో కూడిన విద్య నేర్చుకొని స్ఫూర్తిదాయక పౌరులుగా సమాజంలో మనుగడ సాగించాలని తెలుగు పండితులు అన్నెం శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కవులు నీలకంఠమాచారి యం.యం.డి రఫీ, కొప్పుల ప్రసాద్, మాబు బాషా అబ్దుల్ కలాం జీవిత విశేషాలను స్ఫూర్తిదాయక కవితల ద్వారా వినిపించి అలరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ పాఠశాల కరస్పాండెంట్ డివి సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, డాక్టర్ సుజాత డాక్టర్ శ్రావణ్, డాక్టర్ సంతోష్ పూర్వ విద్యార్థులు శ్రీనివాసులు సంపత్ ప్రభాకర్ రామ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కలిసికట్టుగా ప్రధాని మోడీ సభను విజయవంతం చేద్దాం

**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** దేశ ప్రధాని నరేంద్రమోడీ, సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌లు కర్నూలు పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభను కూటమి నాయకులు కలిసికట్టుగా పనిచేసి విజయవంతం చేయాలని కోడుమూరు బిజెపి అధ్యక్షులు కె మహేష్ నాయుడు, టిడిపి మండల కన్వీనర్ అనుగొండ రామకృష్ణారెడ్డిలు బుధవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16న కోడుమూరు నియోజకవర్గం నుండి బిజెపి, టిడిపి, జనసేన కార్యకర్తలతో పాటు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సభతో కర్నూలు సత్తా చూపించాలని కోరారు. సభ విజయవంతం అయితే మోడీ కర్నూలుపై వరాల జల్లు కురిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. 12గంటలకంతా ప్రధాని సభకు చేరుకోవాలని వారు సూచించారు. మండలానికి దాదాపు 177బస్సులను ప్రభుత్వం కేటాయించిందని ఎవ్వరు అసౌకర్యానికి గురికాకుండా తగిన సౌకర్యాలు కల్పించామన్నారు. కెడిసిసి ఛైర్మన్ ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే దస్తగిరి ఆద్వర్యంలో ప్రధాని సభకు భారీ ఎత్తున హాజరవుతామని వారు తెలిపారు.

# రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

**మండల రజక వృత్తిదారుల సమైక్య సంఘు అధ్యక్షులు చాకలి మధు**

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జీవిస్తున్న రజకులను ఎస్సి జాబితాలో చేర్చాలని 2024 ఎన్నికల్లో రజకులను ఎస్సి జాబితాలో చేరుస్తామని నారా చంద్రబాబు నాయుడు మాటిచ్చారని, ఆ మాటను నేడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని వెల్దుర్తి మండల రజక వృత్తిదారుల సమైక్య సంఘు అధ్యక్షులు చాకలి మధు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల్లో ఎస్సి, ఎస్టిలుగా రజకులు ఉన్నారని, కానీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం బీసి-ఏలుగా ఉన్నారని, 2024 సార్వత్రిక ఎన్నికల ముందు హామి ఇచ్చినప్పటికీ నేటికీ ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడం సిగ్గుచేటన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రాకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా రజకులు అన్ని విధాలుగా వెనుకబడి ఉన్నారన్నారు. కావున రజకులను ఎస్సి జాబితాలో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఈనెల 16వ తేదిన దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా రజకులను ఎస్సి జాబితాలో చేర్చే అంశంపై హామివ్వాలని కోరారు.

# ప్రధాని పర్యటనను విజయవంతం చేయండి

**కర్నూలు ఉమ్మడి జిల్లాల టీడీపీ మాజీ ఉపాధ్యక్షులు గూడూరు సంజీవ రాయుడు**



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** నంద్యాల జిల్లాలో ఈ నెల 16 వ తేదీ గురువారం భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పర్యటనను విజయవంతం చేద్దామని టిడిపి కర్నూలు ఉమ్మడి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు గూడూరు సంజీవరాయుడు పేర్కొన్నారు. బుధవారం ఆళ్లగడ్డ మండలం పరిధిలోని అహోబిలంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆళ్లగడ్డ శాసనసభ్యులు భూమా అఖిలప్రియ సారథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రధానమంత్రి పాల్గొనే బహిరంగ సభకు భారీ ఎత్తున తరలిరావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం అభివృద్ధి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తోనే సాధ్యమన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి దోహదపడుతున్నాయన్నారు.నంద్యాల జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలానికి భారత ప్రధానమంత్రి రావడం ఎంతో శుభపరిణామమనీ, రాయలసీమ అభివృద్ధికి ప్రధానమంత్రి పర్యటన ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. శ్రీశైల శ్రీభ్రమరాంబ,మల్లికార్జున స్వామి వార్లకు భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రత్యేక పూజలు, దర్శనం అనంతరం నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండలం నన్నూరు వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు లబ్ది చేకూరే అంశం, రాయలసీమ అందులో నంద్యాల జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగించనున్నారని ఆయన తెలిపారు.ఈ బహిరంగ సభకు ఆళ్లగడ్డ నియోజకవర్గం నుండి భారీగా తరలివచ్చే విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## విభజన హామీలు అమలు చేయని నరేంద్రమోడీ గోబ్యాక్



స్థానిక బస్టాండ్‌లో మోడీకి వేతిరేకంగా నినాదాలు చేస్తున్న వామపక్ష నాయకులు

**హొళగుంద,మేజర్‌న్యూస్‌:** రాష్ట్రానికి ప్రత్యేక హోదా విభజన హామీలు అమలు చేయని భారత ప్రధాని నరేంద్ర మోడీ గోబ్యాక్ అంటు వామపక్ష నాయకులు బుధవారం నిరసన తెలిపారు.ఇచ్చిన పిలుపు మేరకు నల్ల కండువాలు,నల్ల బ్యాడ్జిలను ధరించి స్థానిక వాల్మీకి సర్కిల్,బస్టాండ్‌లో మోడీకి వేతిరేకంగా నినాదాలు చేశారు.16వ తేదిన కర్నూల్ జిలాస్ల పర్యటనను వేతిరేకిస్తున్నట్లు నాయకులు తెలిపారు.కార్యక్రమంలో సిపిఐ,సిపిఎం,సిపిఐఎంఎల్,న్యూ డెమాక్రిస్ నాయకులు మారెప్ప,వెంకటేశక్రిష్ణయ్య,మునిస్వామి,రంగన్న, సలాంసాబ్,గుతుపాద కార్యకర్తలు పాల్గోన్నారు.

# 23 నుంచి స్కూళ్లలో ఆధార్ క్యాంపులు

**-5 నుంచి 15 సం.ల వయసు వారు బయోమెట్రిక్ అప్డేట్ తప్పనిసరి.. తహశీల్దార్ రవి**

**తుగ్గలి ,మేజర్ న్యూస్ :** గ్రామ, వార్డు సచివాలయాల ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 30 వరకు రాష్ట్రంలోని పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ మంగళవారం కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. 5 నుంచి 15 సంవత్సరాల మధ్య వయసు గల 8,88,923 మందితో పాటు 15 ఏళ్ల పైబడిన వారు మరో 7.6 లక్షల మంది తప్పనిసరిగా తమ ఆధార్ బయోమెట్రిక్ వివరాలను అప్డేట్‌చేసుకోవాల్సిఉందన్నారు.వారికోసంపాఠశాలల్లోక్యాంపులునిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## అంగన్‌వాడీల ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు..



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్ వాడీలు

**హాలహర్వి, మేజర్ న్యూస్ :** హాలహర్వి మండలంలో అంగన్ వాడీల ఆధ్వర్యంలోప్రతి ఏడాది సెప్టెంబర్ నెలలో నిర్వహించే పోషణ మాసోత్సవాలలో భాగంగా అంగన్‌వాడీలు మహిళలకు పోషణ ఉత్సవాల గురించి వివరించారు.ఈ సందర్భంగా మానవహారం నిర్వహించారు. మహిళలకు పోషకాహారం ప్రాముఖ్యత,ఐవైసీఎఫ్, పిబిపిబి, అనిమియా,లోపోషణ గురించి తెలుపుతూ గర్భవతులుకు శ్రీమంతాలు జరిపి పిల్లలకు అన్న ప్రాసనలు కూడా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్ వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులు

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్‌:** స్నేహితులు కేవలం సుఖాల్లోనే కాదు కష్టాల్లోనూ తోడుంటామని నిరూపించారు. మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం చేసి అండగా నిలిచారు. మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణానికి చెందిన అలీభాషా కొన్ని రోజుల క్రితం కాలేయ వ్యాధితో మృతి చెందగా, మిత్రుడి కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచేందుకు బుధవారం 2003-2004 పదవ తరగతి బ్యాచ్ మిత్రులు తమవంతు సాయంగా తోటి మిత్రుడి కుమార్తె పేరు మీద రూ.50వేలు నగదు సేకరించి ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. రాబోయే రోజుల్లో తోటి స్నేహితుడి కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. అనంతరం అలీ స్నేహితులను వెల్దుర్తి ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు రాజు, మద్దయ్య, బాలు, సుధాకర్, సందీప్, చిన్న, సంజీవ్, దస్తు, ప్రసాద్,జాకీర్,నాగిరెడ్డి, శ్రవణ్,హరికృష్ణ,కంబగిరి,రాఘవేంద్ర,శేఖర్, షఫీలు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి నరేంద్ర మోడి సభను జయప్రదం చేయండి

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** నేడు కర్నూలులో జరిగే దేశ ప్రధాని నరేంద్ర మోడి సభను జయప్రదం చేయాలని రాష్ట్ర గౌడ కార్పోరేషన్ చైర్మెన్ వెంకట గురుమూర్తి, నియోజకవర్గ అబ్జర్వర్ దేవుల్ల మురళీలు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మేరీ మండల నాయకులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గం నుంచి కర్నూలు మోడి సభకు 300లకు పైగా ప్రత్యేక బస్సులను కేటాయించినట్లు తెలిపారు. నందికొట్కూరు 60, నందికొట్కూరు రూరల్ 60, మిడ్తూరు 40, కొత్తపల్లి 32, జూపాడుబంగ్లా 42, పగిడ్యాల 42, పాములపాడు 34 ప్రత్యేక బస్సులను కేటాయించి నట్లు తెలిపారు. నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 20 వేల మంది కార్యకర్తలు సభకు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రత్యేక బస్సులలో వచ్చే వారికి అధికారులతో పాటు నాయకులకు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు భారీ సంఖ్యలో కూటమి నాయకులు తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ లింగస్వామి గౌడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ నారపు రెడ్డి, యాదవ కార్పోరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, నాంపల్లి సొసైటి చైర్మెన్ నాగేశ్వర్ యాదవ్, అమర్నాధ్ యాదవ్, నాగేశ్వర గౌడు, సహదేవుడు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర గౌడ కార్పోరేషన్ చైర్మెన్ గురుమూర్తి

**కొలనుభారతి ఆలయ అభివృద్ధికి కృషి :** రాష్ట్రంలోనే ఏకైక క్షేత్రమైన కొలనుభారతి క్షేత్ర అభివృద్ధికి తనవంతు కృషిని అందిస్తానని రాష్ట్ర గౌడ కార్పోరేషన్ చైర్మెన్ వెంకట గురుమూర్తి తెలిపారు. బుధవారం కొలనుభారతి క్షేత్రంను నియోజకవర్గ పరిశీలకులు దేవుల్ల మురళీ, మండల కన్వీనర్ లింగస్వామి గౌడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ నారపు రెడ్డిలతో కలిసి క్షేత్రంను సందర్శించారు. ఆలయ పురోహి తులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలో విశేష పూజలు చేశారు. అనంతరం సప్త శివాలయాలు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. దుశ్శాలువాలతో వారికి సన్మానం చేసి అమ్మవారి ఫోటోలను బహూకరించారు. ఆలయ చరిత్రను పూజారులు వారికి వివరించారు. ఆలయంను పర్యాటక రంగంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

# మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన




**తుగ్గలి,మేజర్ న్యూస్ :** వామపక్ష పార్టీ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నల్ల జెండాలతో బుధవారం తుగ్గలిలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా సిపిఐ మండల సహాయ కార్యదర్శిహనుమేష్ అధ్యక్షత వహించారు. సిపిఐ సిపిఎం మండల కార్యదర్శిలు సుల్తాన్ శ్రీరాములు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన కర్నూలు ఉమ్మడి జిల్లాకు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన వస్తున్న సందర్భంగా మోడీ పర్యటనను నిరసిస్తూ వామపక్షా పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో ప్రత్యేక హెూదా, విభజన హామీలు అమలు కాలేదు అదేవిధంగా కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని,విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ, నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేయాలని వివిధ అంశాలతో పాటు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన డబల్ ఇంజన్ సర్కార్ మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీ సుల్తాన్, శ్రీరాములు నాయకులు కార్యకర్తలు వినోద్,వెంకట్రాంరెడ్డి, రంగస్వామి, రంగరాజు, పీరా,కాశి, చిరంజీవి, రంగడు,శ్రీరాములు పాల్గొన్నారు.

# పీఎం మోడీ గోబ్యాక్ - వామపక్షాల నిరసన

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** విభజన చట్టంలోని హామీలను, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ ఉక్కు ప్లాంట్‌కు నిధులు, కేంద్ర విశ్వవిద్యాలయాల నిర్మాణానికి చెప్పిన హామీలను నెరవేర్చకుండా, రాష్ట్రానికి న్యాయం చేయకుండా కర్నూలు, నంద్యాల జిల్లాల పర్యటనకు వస్తున్న ప్రధాని గోబ్యాక్ అంటూ వామపక్షాలు నిరసన ర్యాలీ నిర్వహించాయి. పద్మావతినగర్ ఆర్చి నుంచి గాంధీచౌక్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని అడ్డుకుని నాయకులను అరెస్టు చేయడంపై పోలీసుల తీరును ఖండించారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధి కోసం తాము చేసే పోరాటాన్ని అడ్డుకుని అరెస్టు చేయడం దారుణమని సిపిఐ, సిపిఎం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అమరావతికి నిధులు ఇస్తామని చెప్పి నీళ్లు, మట్టి ఇచ్చి చేతులు దులుపుకున్నారని అన్నారు. ఇప్పటికైనా పిఎం మోడి రాష్ట్రాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, నాయకులు నాగరాజు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.




నిరసన ర్యాలీ చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

# సూపర్ జీఎస్‌టీపై హోటల్ నిర్వాహకులకు అవగాహన




ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**మహానంది, మేజర్‌న్యూస్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించిన సూపర్ జీఎస్‌టీపై హోటల్ నిర్వాహకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం మహానంది గ్రామంలో హోటల్ నిర్వాహకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అంతకు ముందుగా మహానంది క్షేత్రం నుంచి సచివాలయం ర్యాలీ నిర్వహించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మహమ్మద్ దౌలా, కార్యదర్శి భాస్కర్, ఏబీఎం తిరుపాల్‌రెడ్డి పాల్గొని నిర్వాహకులకు జీఎస్‌టీ తగ్గింపుపై వివరించారు. ఈ సందర్భంగా జీఎస్‌టీ తగ్గింపుకు అనుగుణంగా హోటల్‌లోని పదార్థల రేట్లను తగ్గించాలని సూచించారు. తగ్గించిన జీఎస్‌టీ ప్రకారం ధరల పట్టిక ఏర్పాటు చేయాలని అన్నారు.

## అహోబిలేశుని సన్నిధిలో ప్రముఖుల పూజలు

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామిని బుధవారం వేమూరి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఏలూరు ఎమ్మెల్యే రాధాకృష్ణ, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్, సినిమా డైరెక్టర్ ఎస్ ఎస్ రాజమౌళి తండ్రి, సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్ లు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, అమృతవల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరి రాక సందర్భంగా ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కొలువుతీరిన శ్రీ ప్రహ్లాద వరద స్వామి అమృతవల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.





సూర్య www.suryaa.com



# సహచార మంత్రులతో మంత్రి అచ్చెన్నాయుడు సమావేశం

**ః- కర్నూలులో ప్రధాని పర్యటన ఏర్పాట్లు జోరుగా**



మంత్రులతో సమావేశం నిర్వహించిన అచ్చెన్నాయుడు

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ ః** ప్రధాని మోడీ కర్నూలు పర్యటన సందర్భంగా జరుగుతున్న సూపర్ జీఎస్‌టి-సూపర్ సేవింగ్స్ భారీ బహిరంగ సభ ఏర్పాట్లపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, అనగాని సత్య ప్రసాద్, గుమ్మడి సంధ్యారాణి, కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రధాని పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు అత్యంత శ్రద్ధగా, సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఒకే బృందంలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ నుండి సభా ప్రాంగణం వరకు అన్ని అంశాలను సమగ్రంగా పర్యవేక్షించాలన్నారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ప్రజల్లోకి వెళ్లి సభ విజయవంతం కావడంలో పాత్ర వహించాలని మంత్రి సూచించారు. తదుపరి సభా ప్రాంగణం, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ తదితర అంశాలపై విస్తృతంగా సమీక్షించారు. ఈ కార్యక్రమం కేవలం ఒక సభ కాదు రాష్ట్రంలో అభివృద్ధి యాత్రకు నూతన దిశా నిర్దేశం చేసే ఘట్టం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సభ విజయవంతం కోసం అందరూ ఒకే తాటిపై నిలిచి సమన్వయంతో పనిచేయాలన్నారు.

# శ్రీశైలంలో ప్రధాని ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి,ఎమ్మెల్యే

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** భారత ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం పర్యటన సందర్భంగా ఏర్పాట్లను దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి,శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి బుధ వారం పరిశీలించారు. ప్రధాని పర్యటించే ప్రాంతాలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు.

**మల్లన్న సేవలో మంత్రి ఆనం :** శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.ఆలయ రాజ గోపురంవద్ద మంత్రికి అధికారులు,అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు.ప్రత్యేక పూజలు అనంతరం వేద ఆశీర్వచనలు అందించి శేషవస్త్రం,లడ్డూ ప్రసాదాలు,జ్ఞాపికతో సత్కరించారు.

**మంత్రి,ఎమ్మెల్యేకునూతనతామ్రశాసనాలప్రతిఅందచేత :** శ్రీశైలం ఆలయ చరిత్రను ప్రధానమంత్రి నరేంద్రమో తెలియజే సేందుకు కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుంటోంది.శతాబ్దాల నాటి చరిత్ర కలిగిన



మల్లన్న గొప్పదనానికి ఆలయం దర్పణం పట్టే తామ్ర శాస నాలను ప్రధాని స్వయంగా వీక్షించనున్నారు. ప్రాచీనకాలం నాటి పంచ మఠాలను పునరు ద్ధరించేందుకు కొన్నేళ్ల కిందట చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఘంటామఠం జీర్ణోద్ధరణ పనులు చేస్తుండగా 58 తామ్ర శాసనాలు బయటపడ్డాయి. వీటిల్లోని విష యాలను ప్రధానికి వివరించనున్నారు.దీనికి సంబంధించిన ప్రతిని మంత్రి ఆనం,ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డికి అందజేశారు.

# శ్రీశైలం పాతాళగంగ వద్ద చిరుత మృతి

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలం పాతాళగంగ సమీపంలో చిరుత పులి మృతిచెందిన ఘటన బుధవారం వెలుగుచూసింది. స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.ఇటీవల ఔటర్ రింగ్ రోడ్,పాతాళగంగ మెట్ల వద్ద రాత్రివేళ భక్తులకు తారసపడిన చిరుతే మృతి చెందినట్లు తెలుస్తోంది.కుక్కల కోసం ఇళ్ల మధ్య కూడా సంచరించినట్లు స్థానికులు చెబుతున్నారు.అటవీ శాఖ అధికారులు అక్కడికి చేరుకుని పరిశీలించారు.

**చిరుత పులి మృతిపై డిప్యూటీ డైరెక్టర్ వివరణ :** శ్రీశైలంలో మృత్యువాత పడిన చిరుత పులి మృతదేహాన్ని అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ విజ్జేశ్ అప్పావ్ పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ..చిరుత పాద ముద్రలను గమనిస్తే పైనుంచి దూకి మృతి చెందినట్లు కనిపిస్తోందని ప్రాథమికంగా భావిస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం చేశాక మరిన్ని వివరాలు వెల్లడిస్తామన్నారు. సబ్ డీఎఫ్‌వో భవిత,రేంజర్ పరమేశులు,సెక్షన్ ఆఫీసర్ మదన్ కుమార్,సిబ్బంది ఉన్నారు.



# ప్రసిద్ధి దేవాలయాల్లో శ్రీశైలం ఒకటి

**-మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్**





**శ్రీశైలం,మేజర్ న్యూస్:** ప్రపంచంలోనే ప్రసిద్ధి దేవాలయాల్లో శ్రీశైలం ఒకటని మాజీ ఎంపీ, శివాజీ స్ఫూర్తి కేంద్రం ఛైర్మన్ టీజీ వెంకటేశ్ అన్నారు.బుధవారం శ్రీశైలం దేవస్థానం ఛైర్మన్ రమేశ్ నాయుడు,హిందూ సంఘాల నాయకులతో కలిసి శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని టీజీ సందర్శించారు. అనంతరం మల్లికార్జున అన్నసత్ర సంఘంలో మీడియాతో ఆయన మాట్లాడారు.ప్రధాని శ్రీశైలం రావడం అదృష్టమన్నారు.1973 కొందరు పెద్దల సహకారంతో శివాజీ స్ఫూర్తి కేంద్రానికి శ్రీకారం చుట్టామన్నారు.చత్రపతి శివాజీ మహారాజ్ శ్రీశైలం వచ్చినప్పుడు అమ్మవారి ఖడ్గం బహుకరించినట్లు చరిత్రలో ఉందన్నారు. ప్రధాన మంత్రిని శ్రీశైలం రావాలని పలుమార్లు కోరేమని,లేఖలు కూడా రాసినట్లు పేర్కొన్నారు. ప్రధాని పర్యటన అనంతరం శ్రీశైలం అభివృద్ధి చెందుతుందన్నారు. భక్తులు కూడా శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించాలని అప్పుడే వారిలో దేశభక్తి పెరుగుతుంది అన్నారు.శివాజీ మెమోరియల్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టినట్లు ఆయన తెలిపారు. అంతకంటే ముందు ఆయన మల్లికార్జున అన్నసత్ర సంఘాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా సత్ర కమిటీ ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. సత్రం ఛైర్మన్ శ్యాం సుందర్,ప్రధాన కార్యదర్శి శ్రీరాములు,డైరెక్టర్లు రామకృష్ణ,సురేశ్,శ్రీధర్ తదితరులు ఉన్నారు.

## ప్రధాని పర్యటన సాఫీగా, ప్రశాంతంగా జరిగేలా గట్టి చర్యలు చేపట్టాలి

**ః- సభా ప్రాంగణాన్ని పరిశీలించి రాష్ట్ర డిజీపి హరీష్ కుమార్ గుప్తా ఐపిఎస్**

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ ః** జిల్లాలో నరేంద్రమోడీ పర్యటన సాఫీగా, ప్రశాంతంగా జరిగేలా గట్టి చర్యలు చేపట్టాలని రాష్ట్ర డిజీపి హరీష్ కుమార్ గుప్తా ఐపిఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. నన్నూరు టోల్‌ప్లాజా వద్ద రాగమయూరి గ్రీన్ హిల్స్‌లో సూపర్ జీఎస్‌టి-సూపర్ సేవింగ్స్ బహిరంగ సభా ప్రాంగణాన్ని డిజీపి హరీష్ కుమార్ గుప్తా అడిషనల్ డిజీపి మధుసూదన్ రెడ్డి, ఐజి శ్రీకాంత్, డిఐజీ కోయప్రవీణ్, జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌తో కలిసి పరిశీలించారు. మొదటగా హెలిప్యాడ్, బారికేడ్లు, విఐపి గ్యాలరీలు, కమాండ్ కంట్రోల్, సిసి కెమెరాల కంట్రోల్ రూం, రోడ్డు మార్గాలు, ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్ తదితర ప్రదేశాలను పరిశీలించి భద్రత ఏర్పాట్లుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ పర్యటన సమయంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో డిఐజిలు గోపినాథ్ జెట్టి, సెంథిల్ కుమార్, సత్య యేసు బాబు, పక్కీరప్ప కాగినెల్లి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, డిఐజి సీతారాం, షల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపిఎస్ అధికారులు దీపికా పాటిల్, పరమేశ్వరరెడ్డి, చక్రవర్తి, శ్రీనివాసరావు, గంగాధరరావు, ధీరజ్ కునుబిల్లి, దేవరాజ్, సుమిత్ సునీల్, కమాండెంట్ ఆనంద్ రెడ్డి, ట్రైనీ ఐపిఎస్ అధికారులు, అడిషనల్ ఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న డిజీపి

# ప్రధాని పర్యటన సాగేదిలా..

**కర్నూలు, మేజర్‌న్యూస్ ః** భారత ప్రధాని నరేంద్రమోడీ ఒక్కరోజు ఉమ్మడి జిల్లా పర్యటన కోసం గురువారం ఢిల్లీ నుండి నేరుగా ఓర్వకల్లు విమానాశ్రయానికి రానున్నారు. తొలుత శ్రీశైలం మహాక్షేత్రానికి వెళ్లి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వాములను దర్శనం చేసుకున్న అనంతరం కర్నూలుకు చేరుకుంటారు. కర్నూలులో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సూపర్ జీఎస్‌టి-సూపర్ సేవింగ్స్ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. అదేవిధంగా రాష్ట్రంలో రూ.13,500కోట్లతో ఏర్పాటు కాబోయే వివిధ ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు.

**మినిట్ టు మినిట్ ప్రోగ్రాం ః**

- ★ఉదయం 11.15గంటలకు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వాముల ఆలయ ప్రధాన ద్వారం వద్దకు చేరుకుంటారు.
- ★11.18గంటలకు కృష్ణదేవరాయ గోపురం వద్దకు చేరుకుంటారు.
- ★11.20గంటలకు ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతారు.
- ★11.22గంటలకు ధ్వజస్థంభ దర్శనం.
- ★11.24గంటలకు దక్షిణ దిశ ద్వారం గుండా ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశిస్తారు.
- ★11.27గంటలకు రత్న గర్భ గణపతికి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.
- ★11.35గంటలకు శ్రీ మల్లికార్జున స్వామి వారి అంతరాలయంలోకి వెళ్లి అభిషేకం మరియు పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు.
- ★11.39గంటలకు నందీశ్వర మండపంలో ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు తీసుకుంటారు.
- ★11.41గంటలకు సరస్వతీ గుండంలో శిఖర దర్శనం చేసుకుంటారు.
- ★11.46గంటలకు శ్రీ భ్రమరాంబ అమ్మవారి దర్శనం.
- ★11.51గంటలకు పూజా సంకల్పం, ఖడ్గమాల, కుంకుమార్చన, హారతి, మంత్ర పుష్ప కార్యక్రమాల్లో పాల్గొంటారు.
- ★11.53గంటలకు ఆశీర్వచన మండపానికి వస్తారు.
- ★11.57గంటలకు చతుర్వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాల స్వీకరణ.
- ★11.59గంటలకు సన్మాన కార్యక్రమంలో పాల్గొంటారు.
- ★12.01గంటలకు ఆశీర్వచన మండపం నుండి బ్రహ్మానందరాయ మండపం చేరుకుంటారు.
- ★12.30గంటలకు ఉత్తర ద్వారం వైపు ఉన్న శివాజీ స్ఫూర్తి కేంద్రానికి వెళ్తారు.
- ★12.40గంటలకు శివాజీ దర్బార్ హాల్‌లో ఉంటారు.
- ★12.43గంటలకు శివాజీ ధ్యాన మందిరంలోకి వెళ్తారు.
- ★12.48గంటలకు శివాజీ ధ్యాన మందిరం నుంచి వచ్చి కర్నూలుకు బయలుదేరుతారు.
- ★మధ్యాహ్నం 2.30గంటలకు కర్నూలు బహిరంగ సభావేదికకు చేరుకుంటారు.
- ★2.30గంటల నుండి 2.45గంటల వరకు ఓపెన్‌టాప్ జీపులో రోడ్‌షోలో పాల్గొంటారు.
- ★2.49గంటల నుండి 2.51గంటల వరకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ స్వాగతోపన్యాసం చేస్తారు.
- ★2.51గంటల నుండి 2.53గంటల వరకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రసంగిస్తారు.
- ★2.53గంటల నుండి 2.56గంటల వరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రసంగిస్తారు.
- ★2.56గంటల నుండి 2.59గంటల వరకు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ప్రసంగిస్తారు.
- ★2.59గంటల నుండి 3.06గంటల వరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రసంగిస్తారు.
- ★3.06గంటల నుండి 3.15గంటల వరకు ఓర్వకల్లు-కొప్పర్తి ఇండస్ట్రియల్ నోడ్‌లకు ప్రధానిచే శంకుస్థాపన. రాష్ట్రంలో కేంద్ర నిధులతో రూ.13,500 కోట్లతో జరగబోయే అభివృద్ధి పనులకు కూడా ప్రధాని శంకుస్థాపన చేస్తారు.
- ★3.15గంటల నుండి 4గంటల వరకు ప్రధాని నరేంద్రమోడీ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఆయన ప్రసంగాన్ని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు తెలుగులోకి అనువదిస్తారు.